


సంపుట : ౯.   విక్రమ, ఫాల్గుణము · మార్చి, 1941.   సంచిక : ౬.

* * *

శ్రీ రాధాధర బింబమున్ దొరయు రాచిల్కన్ నిజోరస్థలీ
రారాజన్మణికాంతి రాఁబిలిచి తద్రాకేందు బింబాననా
స్మేరాంకూరముచేఁ గృతార్థుఁ డగుచుం జెల్వొందు గోపాంగనా
జారగ్రామణి కృష్ణుఁ డీవుత మహైశ్వర్యంబు మాకెప్పుడున్.

—పాపరాజు.

* * *

వీరేశలింగంపంతుల్ని విమర్శించి ఆయనవద్ద ఉద్యోగం సంపాదించిన

తోలేటి సుబ్బారావు

ఆయన పుట్టుపూర్వోత్తరాలు
ఆయన చేసిన ఉద్యోగాలు
ఆయన రచించిన గ్రంథాలు

రచయిత :
వేకుమళ్ల కామేశ్వరరావు, బి. యే. బి. ఇడి.

తోలేటి వెంకటసుబ్బారావు గారు 1875-వ సంవత్సరంలో పశ్చిమ గోదావరిజిల్లాలోని పెరవలి గ్రామంలో జన్మించారు. పెరవలి ఈయన మాతామహస్థలం. సుబ్బారావుగారు అమావాస్యరోజున జన్మించారు. ఆరోజున పట్టపగలు చుక్కలు పొడిచాయి. కవిగారు ప్రథమశాఖ యాజ్ఞవల్క్య నియోగులు. వారి తండ్రి పేరు నరసింహంగారు, తల్లి పేరు రాజ్యమ్మ.

సుబ్బారావుగారి పూర్వులు అమలాపురం తాలూకాలోని మండపల్లి గ్రామ నివాసులు. సుబ్బారావుగారి తండ్రిగారు నరసింహంగారు మాత్రం ఉద్యోగంమీద కాకినాడదగ్గిర ఉన్న తాళ్ళరేవుకి వచ్చారు. ఆటుతర్వాత ఆర్బత్‌నాట్ కంపెనీలో 25 రూపాయల జీతంమీద ఉద్యోగంకాగా రాజమహేంద్రవరం వచ్చారు.

నరసింహంగారికి సంతానం చాలా ఆలస్యంగా కలిగింది. భార్య కాపరానికి వచ్చిన పదిహేనేళ్ళకి ఒక్క కొడుకు కలిగాడు. ఆకొడుకే సుబ్బారావుగారు. నరసింహంగారికి కలిగిన సంతానం ఈయన ఒక్కడే.

రాజమహేంద్రవరం వచ్చేటప్పటికి సుబ్బారావుగారికి పదినెల్లు. రాజమహేంద్రవరం వచ్చినవెంటనే ఈ చంటిపిల్లవాడికి కళ్లు కనపడలేదు. కారణం ఎవరికీ తెలియదు. తల్లిదండ్రులు అనేకవైద్యాలు చేయించారు. అనేక మొక్కులు మొక్కుకున్నారు. చిట్టచివరికి హఠాత్తుగా కళ్లు కనబడ్డాయి. తల్లిదండ్రులు సంతోషించారు. అంతా ఆశ్చర్యపడ్డారు.

సుబ్బారావుగారు ఇన్నీస్‌పేట స్కూలులో అప్పర్ ఫోర్తువరకూ చదివారు. చిలకమర్తి లక్ష్మీనరసింహంగారికి సహాధ్యాయులు. వీరు ఈ పాఠశాలలో చదువుతూన్నప్పుడే 'ఆంధ్రప్రకాశిక', 'పురుషార్థప్రదాయిని' 'మనోరంజని' మొదలైన పత్రికలికి చిన్నచిన్న వ్యాసాలు రాసేవారు. ఈయన వ్యాసాలలో వెటకారం ఎక్కువగా ఉండేది.

సుబ్బారావుగారు అప్పర్ ఫోర్తు చదువుతూన్నప్పుడే 'నాచికేతూపాఖ్యానం' అనే వచన గ్రంథం రాశారు. ఆపుస్తకాన్ని వీరేశలింగంగారూ, వావిలాల వాసుదేవశాస్త్రిగారూ మొదలైన పండితులూ, అనేక పత్రికలూ మెచ్చుకున్నాయి. ఆ సంవత్సరమే అది రాజమహేంద్రవరంలోని పాఠశాలలో పాఠ్యగ్రంథంగా నిర్ణయించబడింది.

వీరేశలింగంగారితో తమకు కలిగిన పరిచయాన్ని గురించి సుబ్బారావుగారు ఇలాగ చెబుతున్నారు.

"నేను మొదటినుంచీ అందరినీ వెటకారంచేసేవాణ్ణి. నా స్నేహితుడొకడు నన్ను చూసి 'ఒరే! నువ్వు వీరేశలింగంగారిని ఏడిపిం

చాలిరా' అన్నాను. అని, నాకు వీరేశలింగంగారిని చూపించాడు. ఆతర్వాత ఒకనాడు నేను వీరేశలింగంగారి హరిశ్చంద్రనాటకం ఒక నాటకసమాజంవారు ప్రదర్శిస్తూండగా చూశాను. ఇంటిదగ్గర ఆ నాటకం జాగ్రత్తగా చదివాను. చదివి, అన్నీ తప్పులే చూపిస్తూ, చిట్టచివరికి ఇది పనికిమాలిన నాటకమని నిర్ణయంచేస్తూ ఒక విమర్శరాసి వీరేశలింగంగారికే తమ వివేకవర్ధనీపత్రికలో వేసుకోవలసిందని పంపాను. వివేకవర్ధనిలో ఆ విమర్శ పడింది. అందరూ చదివి సంతోషించారు.

వీరేశలింగంగారు ఒక రోజున నాకోసమని కబురుపంపారు. తన నాటకాన్ని తిడుతూ రాసినందుకు నన్ను ఆయన తన్నడానికే కబురు పంపాడని నిశ్చయించుకుని నేను జంకుతూ వెళ్లాను కాని నేను అనుకున్నదానికి వ్యతిరేకమే అయింది. ఆయన నన్ను ఒక వంద ప్రశ్నలు వేశారు వేసి, నువ్వు రాసిన విమర్శ చాలాబాగుంది అన్నారు. అని, నాకు తనపుస్తకాలన్నీ బహుమానమిచ్చారు.”

ఈపుస్తకాలన్నీ చదివినమీదట సుబ్బారావుగారికి వీరేశలింగ కవిచరిత్ర రాద్దామని ఉద్దేశంకలిగింది. అటుతర్వాత కొద్ది కాలంలోనే ఆ పని ప్రారంభించారు.

సుబ్బారావుగారు మశూచికం పడి పాఠశాలలో పైచదువు మానేశారు. ఒకమారు ఈయన్ని వీరేశలింగంగారు పిలిచి తన ముద్రాశాలలో 20 రూపాయల జీతం మీద మేనేజరుగా వేశామనీ, పని చెయ్యవలసిందనీ చెప్పారు. సుబ్బారావుగారు ఒప్పుకున్నారు. ఈయన వీరేశలింగంగారి దగ్గిర ఒక ఏడాదిన్నర మాత్రమే పనిచేశారు ఎందుచేతంటే వీరేశలింగంగారికి చెన్నపట్టణం బదిలీఅయి రాజమహేంద్రవరం విడిచి వెళ్ళిపోయారు. గనక. వీరేశలింగంగారి దగ్గిర ఉన్నకాలంలోనే సుబ్బారావుగారు 'వీరేశలింగ కవి చరిత్ర' పూర్తి చేసి వివేకవర్ధనీముద్రశాలలోనే అచ్చువేయించారు.

ఆ తర్వాత సుబ్బారావుగారు యు.యల్.సి. మిషన్ స్కూలులో ఒక ఏడాది ఆంధ్ర పండితులుగా పనిచేశారు. ఆ ఉద్యోగం చేస్తూనే మదరాసు టింబరు కంపెనీ ఏజెంటుయొక్క గుమాస్తాగా పని చేస్తూండేవారు. కాని ఈ రెండు పనులూ ఒక్కమాటు చెయ్యడానికి కుదరక వారు ఉపాధ్యాయపదవి వదులుకొని కంపెనీ గుమాస్తాగా ఉన్నారు. ఈఉద్యోగం అయిదున్నర సంవత్సరాలపాటు చేశారు. అటుతర్వాత తమకి పెద్ద ఉద్యోగమిప్పిస్తానన్న దొర చనిపోడంచేత ఆ ఉద్యోగం విడిచిపెట్టేసి గోదావరి బ్రిడ్జి ఆఫీసులో రెండోగుమాస్తాగా చేరారు. ఈ ఉద్యోగం 1897 నుంచి 1900 వరకూ ఉంది. అటు తర్వాత సత్యవోలు గున్నేశ్వరరావుగారి చింతామణీముద్రాశాలలో గుమాస్తాగా ప్రవేశించారు. 1900 సం॥ లోనే సుబ్బారావుగారి తండ్రి అరవైయ్యోయేట దివంగతులయారు. చింతామణీముద్రాశాలలో నైనా సుబ్బారావుగారు చాలాకాలం పని చెయ్యలేదు ఒక ఏడాదిన్నర మాత్రమే చేసి మళ్లా యు.ఎల్.సి. మిషన్ స్కూల్లో ఆంధ్రపండితుడి పదవి ఖాళీరాగా– అంతవరకూ పండితుడుగా ఉన్న సుంకర రంగయ్యగారు చనిపోయారు గనుక— తాము ప్రవేశించారు. ఈఉద్యోగంలో 22 ఏళ్ళపాటున్నారు. చివరికి మిషన్ వాళ్లు కొన్ని ఉద్యోగాలు తగ్గిస్తూ సుబ్బారావుగారి ఉద్యోగంకూడా 1932 లో తగ్గించేశారు! ఇప్పుడు వీరికి ఇంకా స్థిరమైన ఉద్యోగంఏదీ దొరకలేదు. సుబ్బారావుగారు మొత్తంమీద నలభైమంది మిషనరీలకి తెలుగు చదువు చెప్పారు.

సుబ్బారావుగారికి పన్నెండో ఏట పెళ్ళిఅయింది, మేనరికం. భార్యపేరు రామలక్ష్మమ్మ. భార్యకీ, ఈయనకీ మధ్య ఆరునెల్లే తేడా. మామగారిపేరు ఏనాపు నారాయణదాసుగారు. సుబ్బారావుగారికి 1898 లో ఒక కుమార్తె, 1900 లో మరొక కుమార్తె కలిగారు. మగసంతానంలేదు. రాజ్యలక్ష్మమ్మగారు 1906 లో చనిపోయి భ

ర్తని దుఃఖసముద్రంలో ముంచారు. అటుతరువాత రెండేళ్ళకు సుబ్బారావుగారి తల్లిగారు పోయారు. ఆతర్వాత మరికొన్నిఏళ్ళకు సుబ్బారావుగారి పెద్దకుమార్తె ఒక కొడుకునుకని చనిపోయింది. ఈమోస్తరుగా సుబ్బారావుగారికి సాంసారికమైన కష్టాలు కలిగాయి. భార్య పోయినతర్వాత సుబ్బారావుగారు మళ్లా పెళ్ళిచేసుకోలేదు. వివాహ విషయమై ఆయన ఇలా చెబుతున్నారు. "మాతల్లిదండ్రులు చిన్నప్పుడు నాకు వివాహంచెయ్యకుండా వివాహం విషయం నాకే విడిచిపెట్టి ఉంటే నేనెప్పుడూ వివాహం చేసుకుని ఉండేవాణ్ణికాను. వివాహం విషయమై నన్ను సలహా అడిగినవారి కందరికీ వివాహం చేసుకోవద్దు, చేసుకుంటే చాలా చిక్కులున్నాయి అని చెబుతూ ఉంటాను" అని.

సుబ్బారావుగారికి మతవిషయమై అనేకస్వతంత్రాభిప్రాయాలున్నాయి. వీరేశలింగంగారి దగ్గిర వీరు ఉద్యోగంచేసేకాలంలో వీరేశలింగంగారూ, వీరూ మత విషయమై చాలా వాదించుకునేవారు. సుబ్బారావుగారు ఎప్పుడూ వీరేశలింగంగారితో భేదాభిప్రాయంకలిగే ఉండేవారు. అయినా వీరేశలింగంగారు ఎప్పుడూ వీరి ఉద్యోగానికి భంగం చెయ్యలేను.

సుబ్బారావుగారు చిన్నతనంలో 'నాచికేతూపాఖ్యాన' మనే వచనకావ్యం రాశారు. అటుతర్వాత 'కందుకూరి వీరేశలింగం చరిత్ర 1894 లో ప్రకటించారు. ఇమ్మానేని హనుమంతరావు నాయుడుగారి అధికప్రోత్సాహంవల్ల వీరు 'హరిశ్చంద్రనాటకం' రాశారు. ఈ నాటకంలో పద్యాలుమాత్రం శంకరకవికృత హరిశ్చంద్రోపాఖ్యానంలోవి. ఈయన రాసిన ఇతర గ్రంథాలు ఏమిటంటే (1) సుదర్శన విజయం. 1924 లో రచించబడిన వచనకావ్యమిది. దేవీ భాగవతంలోని ఒక చిన్న కథ పెంచి రచించబడింది. (2) జ్ఞానభాస్కరం. ఒక వచనకావ్యం. (3) మానవజీవితం, ధనం. ఈపద్యకావ్యం 1929 లో రచించబడింది. (4) శ్రీమదఖండగౌతమి. ఇదొక పద్యకావ్యం. (5) కోటగిరి. ఒక చిన్న పద్యకావ్యం. (6) కాకినాడ కాంగ్రెసు- ఒక చిన్నపద్యకావ్యం. (7) పువ్వులగంప, పువ్వులగంప అను పేరుగల ఒక వచనకావ్యాన్ని అనుసరించి రచించబడిన పద్యకావ్యం. ఈ ఆఖరిపుస్తకం తప్ప తక్కినవన్నీ అచ్చుఅయేయి. వీరు 'ఆంధ్రశాకుంతల విమర్శనము (1912), చిత్రనళీయ నాటక ప్రదర్శనము అను రెండు విమర్శగ్రంథాలు ప్రకటించారు. ఇప్పుడు వీరు 'శ్రీరామలీలా హనుమ ద్విలాసం' అనే పెద్ద సీసమాలిక గ్రంథం రాస్తున్నారు.

వీరిచరిత్ర ముగించ మునుపు చెప్పవలసిన ఒక సంగతేమిటంటే, సుబ్బారావుగారికి కాలంవిషయమై బొత్తిగా జ్ఞాపకంలేదు. వారు ఎంతో కష్టపడి నాకు పై సంగతులు తెలియచేశారు.

హోలిపండుగ

ఇది

కామదహనస్మారకమా ?

హోలికారాక్షసికి సంబంధించినదా ?

పూతనా సంహార సంబంధమైనదా ?

భారతీయుల పెద్ద పండుగల్లో హోలిపండుగ ఒకటి.

ఇది మనఆంధ్రప్రాంతాల్లో అంతగా ప్రచారంలోలేదు. నూజవీడులోమాత్రం ఈపర్వం జరుపుతారు.

ఈపండుగ ఫాల్గుణ పూర్ణిమకు ఒక పక్షం ముందుగా ప్రారంభమౌతుంది.

సర్ విలియమ్‌జోన్సు ఈపండుగ Vernal Equinox కు సంబంధించిందన్నాడు.

ఇది పెర్షియనుల జామ్‌షెడినారోజ్ పండుగ వంటిది అంటారు.

ఈపండుగ శ్రీకృష్ణుని గౌరవార్థం జరుపబడుతుంది.

అతి ప్రాచీనమైన పండుగలలో ఇది ఒకటి. దీనినిగురించి ఒక కథ.

తారకాసురుడు

త్రిపురనాయకుడైన తారకాసురుడు పూర్వకాలంలో దేవతలకు చాలా పీడ కరుడుగా వుండేవాడు. అప్పుడు దేవతలు తమకు వానిపీడ వదల్చమని బ్రహ్మదేవుని, విష్ణుమూర్తిని ప్రార్థించారు. శంకరుడు పార్వతిని వివాహమై షడాననుడు అనే కుమారుణ్ణికంటే ఆకుమారుడు తారకాసురుణ్ణి సంహరించి తారకునివలని పీడ తొలిగిస్తాడని బ్రహ్మమొదలయినవారు దేవతలకు చెప్పారు.

అప్పుడు దేవతలరాజు ఇంద్రుడు కామదేవునిపిలిచి హిమాద్రికిపోయి శంకరుడు పార్వతిని వివాహమయ్యేటట్లు చేయమని చెప్పాడు.

మహాదేవుడు ఆసమయంలో తపంచేస్తున్నాడు. కామదేవుడు తన భార్యఐన రతీదేవితోకూడి శివుడు తపస్సుచేస్తూవున్నచోటికి వెళ్లాడు. రతీదేవి పార్వతిలో ప్రవేశించింది. మదనుడు శివుణ్ణి మోహపరవశుణ్ణి చేయడానికి వేచివున్నాడు.

శంకరుడు

ఇంతలో వసంతకాలంవచ్చింది. ఆ ప్రదేశమంతా పువ్వులవాసనతో గుమగుమలాడింది. పక్షులు కలకలారావాలు చేశాయి. ఆరవాలు యోగీశ్వరేశ్వరుడయిన శివుని తపస్సును భగ్నంచేశాయి.

శంకరునివాహనమైన నంది అల్లంత దూరాన్నివుండి సవ్వడిచేసే పక్షుల్ని తోలివేసే పనిలో వుంది.

శివున్ని ఎల్లాఐనా పొందాలని దీక్ష పట్టిన పార్వతి మన్మథుని వెనకాల నిలిచివుంది. శివుడు తన కళ్లుతెరిచి చూశాడు. తనతపస్సుకు భంగంకలిగించినందుకు శివుడు మన్మథుణ్ణి కోపపడ్డాడు. కోపపడి తనమూడోకన్ను తెరిచాడు. అందుండి మంటలులేచి కామదేవుణ్ణి భస్మం చేశాయి.

ఇది ఫాల్గుణ పూర్ణిమనాడుజరిగింది.

కామదహనం

కామదహనం—అనగా శివుణ్ణి మోహపెట్టతలచిన కాముడు భస్మమైపోవడం—చూచి శివుని అనుచరులు శివదూతలు, గణాలు ఆనందాన్నిపొంది జయజయధ్వానాలు పలికారు.

ఆసందర్భంలో శివుడు అందరికీ ఒక ఆజ్ఞచేశాడు : ఈనాటినుంచి ఫాల్గుణ పూర్ణిమనాడు యేటేట మర్త్యులు అందరూ హోలీలు (నిప్పులగుండాలు) చేసి ఈపండుగ జరపాలని—అట్లా జరపకపోయినట్లయితే వారు ముష్టివాళ్ళయి ముష్టిబతుకు బతుకుతారని—

మహారాష్ట్రులు

ఈపండుగ పన్నెండోరోజున మహారాష్ట్రులు రాత్రి రంగుతెచ్చుకోడానికి దేవాలయాలకు వెళతారు.వీరు.ళ్లల్లో పున్నాగపు (Oilnut tree - Calophyllum inophyllum) ఆకులూ, పటిక, కాల్చి ఆర్చని సున్నము (Quicklime) కలిపి కొస్తే రంగు వస్తుంది.

ఆనాడు దేవాలయాల్లో అర్థరాత్రి వరకు నాట్యాంగనలు ప్రేక్షకులకు నాట్యవిద్య ప్రదర్శిస్తారు. ఆనాడు పిన్నలు, పెద్దలూ అందరూ ఎర్రరంగు బట్టలు ధరిస్తారు. మొన్న మొన్నటివరకు ఆనాడు మహారాష్ట్రులకు ముదురు పసుపురంగు తలపాగలు ధరించడం ఆచారమైవుండేది.

పెద్ద హోలి

ఫాల్గుణపూర్ణిమనాడు పెద్ద హోలి పండుగ. ఇంటిముంగురకాని, గుడి ఆవరణలోకాని పెద్ద గొయ్యితవ్వి ఆగోతులో పెద్దమంట పెడతారు. ఆమంటకు పూజ చేస్తారు. పూజ సాగుతూవుండగా తాళాలు, డోళ్లు మొదలయిన దేశీయ వాద్యాలు వాయిస్తారు.

పండుగ ఆఖరిరోజున ఆగొయ్యిలో మట్టిపోసి పూడ్చివేస్తారు. ఆనాటి సాయంకాలం దేవాలయాలలో గంధప్రదానం, మంచిగంధం, ఆడవిపసుపు మొదలయినవి కలిపిన రంగు (బుక్కాపొడి) ఇస్తారు. ఆసమయంలో దేవాలయంలో హరిదాసు కీర్తన పాడుతూవుంటాడు.

ఈనాడు క్రిందితులాలవారు గొప్పకులాలవారితో కలిసివుండి తీసుకునే చనువు చూస్తే ఈపండుగ రోమనుల శటర్నేలియాను (Saturnalia) పోలివుంటుందని చెప్పవచ్చు.

రక్షోధ్వన

నారదీయపురాణంలో ఫాల్గుణమాసపు పూర్ణిమ హోలిపర్వమనే సంగతి గలదు. ఆరోజున కర్రలు, గడ్డి మొదలైనవి కుప్పవేసి మంత్రాలతో మంటపెడతారు. ఆమంత్రం యాజుర్వేద పంచమాధ్యాయంలోని రక్షోధ్వన అని పేరుగల మంత్రం. దాని ముగింపు.

'శ్రీ, హోలీ! అహంకారరాక్షసుని వల్ల భయపడి పిల్లవాళ్లు నిన్ను తయారుచేశారు. మేముకూడా నిన్ను ప్రార్థిస్తున్నాము. నీ విభూతి మాకు అందరకీ సంపద ఇచ్చునుగాక!' అని.

భూతప్రేతాలు రాత్రిపూట గాలిలో కలిసి బాలకుల్ని పీడిస్తూవుంటాయి. ఈ అగ్నిజ్వాలలవల్ల అవి పారిపోతాయి. బాలకుల రక్షణార్థం నిన్ను పూజిస్తున్నానని ఆమంత్రంయొక్క పూర్వకాలంలో అర్థం.

హోలికాభస్మం

ప్రతి పౌర్ణమికి ఇట్టి చిన్న యజ్ఞాలు చేయడం ఆచారమైవుంటేది. ఈరోజున అందరూకలిసి పెద్దదిగా చేస్తారు. పూజ ఐనతరువాత అందులోని హోలికాభస్మాన్ని అందరూ ఒంటికి పూసుకుంటారు.

ఆసమయంలో చదివేమంత్రంయొక్క అర్థం :

'' ఓదేవి! నిన్ను ఇంద్రుడు, బ్రహ్మ, శంకరుడు మున్నగువారుకూడా, పూజించారు. అట్టి నిన్ను నేను పూజిస్తున్నాను. నీవు నాకు ఐశ్వర్యం ఇత్తువుగాక!''

హోలి పర్వం చేయడానికి పౌర్ణమి సాయంకాలం ఉత్తమమైంది. ఆ రాత్రి హోలిమంట పెట్టాలి. దీనినిగురించి పురాణాల్లో చెప్పబడింది. పగలు ఎప్పుడూ హోలిమంట పెట్టకూడదు. మంటపెట్టిననాడే హోలీపండుగను కూడా చేయాలి.

వైష్ణవులు

ఈ పౌర్ణమినాడు వైష్ణవులు డోలోత్సవం చేస్తారు. ఈడోలోత్సవాన్ని గురించి బ్రహ్మపురాణంలో కలదు. ఫాల్గుణపూర్ణిమనాడు ఉయ్యాలఊగుతూ ఏకాగ్రతతో విష్ణువును ప్రార్థించేవాడు వైకుంఠానికి పోతాడు. హోలీమంట ఆయినతరవాతనే డోలోత్సవం చేయాలి. పూర్ణిమకి పూర్వరాత్రి హోలిమంట వేస్తే డోలోత్సవం పాడ్యమినాడు చేయాలి. ఆదేరోజున రంగుబుక్కా చల్లుకోవడం ఒక తంతు.

పధ్నాలుగురు మనువుల్లోనూ ఒకడు ఫాల్గుణచతుర్దశిరోజున పుట్టాడు. అందుచేతకూడా ఇది పర్వదినం.

అగ్నిపూజ

ఇంగతో వసంతం ప్రారంభమౌతుంది. ఈపర్వం అగ్నిపూజకు ఉద్దిష్టమైంది. ఆపూజయే హోలికాపర్వంలో అంతర్గతమైవుంది భగవంతుడు లోకమంతా అగ్నిరూపంతో వ్యాపించివున్నాడు.

భవిష్యపురాణంలో నారదుడు ధర్మరాజుతో ఇట్లు చెప్పినట్లు కలదు. 'ఫాల్గుణపూర్ణమిరోజున ప్రతివానికి అభయదానం ఇవ్వడం అవసరం. అభయదానంవల్ల ప్రజలంతా స్వేచ్ఛగా సుఖింపగలరు. ఆనాడు ఊళ్ళోవున్న పిల్లలంతా కాలుతూవున్న కొరకంచులతో వీరులవలె వీధులవెంట తిరగాలి. ఆపుల్లలన్నీ ఆఖరున ఒక కుప్పగాచేసి మంటపెట్టాలి. ఆ అట్టహాసంతోటి, అప్పుడు చదవబడే మంత్రాలతోటి రాక్షసుడు హరించిపోతాడు.'

హోలికరాక్షసి

హిరణ్యకశపుని చెల్లెలు — హోలిక: ప్రహ్లాదుని అత్త — ప్రహ్లాదుని తీసుకువెళ్ళి మంటలో కూర్చోపెట్టింది. భక్తుడైన ప్రహ్లాదునికి ఆ అపకారంచేసినందుకు హోలిక తానే అపకారాన్ని పొందింది. కాబట్టి ఈపర్వం ఆపేరుమీదే ఇప్పటివరకు చేయబడుతూవుంది. హోలికమంటతో సమస్త పాపాలు పోతాయి.

మంట వేసి దానికి మూడు ప్రదక్షిణాలు చేసి ఆమీద పరిహాసాలు ఆడుకోవాలి. భద్రాకాలములో మంట పెట్టకూడదు. అప్పనిసరి ఐతే భద్రాకాలం ప్రారంభ మయ్యేక మొదటి ఐదుగడియలు వదిలేసి ఆమీద చేయాలి.

దక్షిణదేశంలో హోలీపండుగ ఫాల్గుణశుక్ల నవమిని చేస్తున్నారు. ఉత్తర హిందూదేశంలో ఫాల్గుణమాసం పొడుగునా ఈ పండుగ చేస్తూ వుంటారు. రాజపుటానాలో మాత్రం కిందితరగతుల ప్రజలు పాటలతో, మంటలతో ఈ ఉత్సవాన్ని ప్రారంభంచేస్తారు. రాజులు మాత్రం పదిహేనురోజులు చాలా గొప్ప ఉత్సవాలు చేస్తారు. ఈపదిహేనురోజుల్లో ఈ పండక్కి రోజుకు ఒక పేరు మారుతూవుంటుంది. రంగపంచమి, నావహోలి మున్నగునవి విశేషమైనవి.

హోలికాపర్వానికి హుతాశనదహనం, డోలాయాత్ర, హోలికాదహనం అనికూడా అంటారు.

వివిధ ప్రాంతాల్లో

హోలిపండగ ఎందుకు చేస్తారు?

రక్షోధ్యనమంత్రంవల్ల, వసంతోత్సవ సంబంధంవల్ల ఇది అనాదినుండి వున్నట్లే ఊహించాలి.

వంగదేశంలో ఇది కృష్ణసంబంధమైన పర్వంగా ఎన్నుకొని హోలిక అంటే పూతనఅని అర్థం చెబుతున్నారు. ఒరిస్సాలో ఈనాడు శ్రీకృష్ణుని డోలోత్సవం చేస్తారు. హోలికాదహనం లేనేలేదు. చైతన్యస్వామి, గోస్వామి ప్రబోధం ఇందుకు కారణమైవుండును. పండగలనన్నిటినీ వారు కృష్ణపరంగా తిప్పివేశారు. రజపుటానా వారికి హోలిక ప్రహ్లాదుని అత్త. మహారాష్ట్ర కొంకణ దేశీయులకు ఇది పిల్లల్ని ఎత్తుకుపోయే ఢూంఢా అనే రాక్షసియొక్క దహన చిహ్నదినం. ఈ కథ భవిష్యపురాణంలో వుంది.

దక్షిణదేశీయులకు ఇది కామదహన స్మారకదినము.

శూద్రులు

ఈపండుగ ఇప్పుడు భారతదేశంలో జాస్తీగా శూద్రులే చేస్తున్నారు. శ్రావణి బ్రాహ్మణులకు, దసరా క్షత్రియులకు, దీపావళి వైశ్యులకు ఎట్లు ప్రత్యేకింపబడిపోయిందో హోలిక శూద్రుల పండుగ ఐపోయింది.

శుక్ల త్రయోదశి మొదలు పౌర్ణమి వరకు గల మూడురోజులు మహారాష్ట్ర, కర్ణాటదేశాల్లో పెద్ద ఉత్సవం జరుగుతుంది.

ఆరోజున ఒకరిమీద ఒకరు రంగు కొట్టుకోవడంలో పూర్వశత్రుత్వాలన్నీ పోవడమేకాకుండా ఒక విధమైన కొత్త స్నేహం ఏర్పడుతూవుంది.

ఒరిస్సాలో ఈ నాడు కృష్ణవిగ్రహాన్ని ఊరేగిస్తారు. ఆఊరేగింపులోనే ఒకరిమీద ఒకరు బుక్కా చల్లుకుంటారు. ఊళ్ళోవున్న గొల్లవాళ్లు వేషాలు వేసుకుని జట్లుగా ఏర్పడి ఆనందంగా కాలక్షేపం చేస్తారు.

హోలిమంటలు

మధుర, బృందావనం ప్రాంతాల్లో ఈపండుగ అత్యంతవైభవంగా జరుగుతుంది.

యీనాటి మంటల్లో కర్రలు, కంపలు ఎత్తుకొచ్చివేయడంవుంది. బొంబాయి ప్రాంతంలో హోలిమంటమీద నీళ్లు కాచుకుని స్నానంచేయడం కొందరి ఆచారం. ఆటవారు పూర్ణిమ మరునాడు అనగా పాడ్యమినాడు పండుగచేస్తారు.

రాజపుత్రస్థానం, పంజాబుల్లో యీ పండగను 'ధూలండి' అంటారు. పిల్లలు పొద్దున్న మొదలుకొని మన్నుమశానం రంగులతో కలిపి పొట్లాలుకట్టి వచ్చిపోయేవాళ్ళమీద విసురుతూ వుంటారు. ఇట్లా మూడురోజులు కొట్టుకుని నాలుగోరోజున ఊరంతా శుభ్రంచేసుకుని పండుగ చేసుకుంటారు.

దక్షిణదేశంలో యీనాడు శివాలయంఎదుట హోలీమంట వేస్తారు. కొంకణప్రాంతంలో రాత్రిఅంతా భోగం మేళాలు సాగుతాయి. విలాసంగా కాలక్షేపంచేస్తారు. గ్వాలియర్ రాజ్యంలో కూడా ఇట్లే జరుగుతుంది.

అత్యాచారం

యీపండగ సందర్భంలో విశేషంగా విచారించవలసింది ఏమిటంటే స్త్రీలు యీనాడు కట్టుబాట్లుతప్పి వర్తించడం.

హోలీదేవతను రాజపుత్రస్థానంలో గుర్రంమీద కూర్చోపెట్టి ఊరేగిస్తారని టాడ్ దొర వ్రాస్తున్నాడు. ఆ ఉత్సవంలో అందరూ ఎర్రబట్టలే కట్టుకుంటారు. సవారీలో వెనక మేవాడ్ రాజు వస్తూవుంటాడు. భోజనానంతరం ఒక్కొక్కరికి కొబ్బరికాయ, కర్రకత్తి ఇస్తారు.

సంవత్సరంలో ఇది ఆఖరుపండుగ. మొదటిపండుగ ఐన వత్సరాది, ఆఖరుపండుగ ఐన హోలి వైభవంగా చేయతగ్గవి.

యీపండక్కి కామదహనానికి గల సంబంధంపురాణాల్లో వివరింపబడలేదు.

యీనాడు ఏదో ఒకటి ఎత్తుకువచ్చి నిప్పులో వేయాలనే నమ్మకం ప్రజలలో వుంది. యీనాడు తాగడంకూడా ముఖ్యమని కొందరి నమ్మకం.

✲ అచ్చుతీరి అమ్మకమునకు సిద్ధముగా ఉన్న శ్రీ ఆంధ్ర శేషగిరిరావుగారి గ్రంథములు

ఆంధ్రరమణీమణులు భా-౧

ఇందు—కాకతీయాంధ్రసామ్రాజ్య సింహాసన మధిరోహించి జనరంజకముగ, శత్రుభయంకరముగ రాజ్యమేలిన రుద్రమ్మ; ధరణికోట సింగపుపీఠి నెక్కి అసామాన్యముగ రాజ్యచక్రము త్రిప్పిన గణపమ్మ; ఆంధ్రదేశమున ఆడుదియై పుట్టిన మంత్రిరాక్షసుని అపరావతారముగా నాయకురాలను బిరుదుగాంచిన పలనాటి నాగమ్మ. కౌగిలిలోనున్న భర్తను దీవించి కరవాలమొసగి కదనరంగమునకంపిన మాంచాల; ప్రజారంజకముగ పెద్దాపుర సంస్థానమును పాలించి తురక పౌజుదారుని బారి పడకుండ జోహారొనర్చిన అభిమానస్వరూప రాగమ్మ; ఆమె చేతులనుండి ఆమె మనుమని ఏడు మాసముల కసుగందుని గ్రహించి పంచకరపాట్లుపడి అరసి రక్షించిన స్వామిభక్తిపరాయణ మహాలక్ష్మమ్మ; పతియగు రాయజగపతితో సహగమన మొనర్చుచు పతి విరోధియగు ఆనందరాజునకు తిరుగని శాపమిచ్చిన మహాపతివ్రతాతిలకమగు సీతమ్మ; రాణివాసపు స్త్రీలందఱకంటె ముందుగాం దాను కత్తికెరయైన మానమెఱిగిన స్త్రీత్వమునకు మొదలి పేరైన బొబ్బిలిరాణి మల్లమ్మ; నిండు చూలాలయ్యు మానసంరక్షణార్థమై నిజప్రాణముల ఖడ్గమున కెరచేసిన రమణమ్మ— వీరలఅద్భుతచరితలు ఆంధ్రాభిమానముతో ప్రస్తరింపబడినవి.

2–వ కూర్పు. 112 పుటలు. దళసరి కాగితములు.
పోస్టుఖర్చులు ప్రత్యేకము. ప్రతి 1–కి అ 8.

ఆంధ్రరమణీమణులు భా-౨

ఇందు—రణరంగమున వీరవిహారము విరమించి యింటికి వచ్చిన పతికి వీరసందేశమిచ్చి తిరిగి కదనభూమికి పంపి అతనికి వీరస్వర్గ మిప్పించిన ఆంధ్ర వీరపత్ని చానమ్మ- మానముకొఱకు, మాటవాసికొఱకు తన్నుతాను పొడుచుకొని చనిపోయిన తంజావూరి తెనుగురాణి రాజగోపాలమ్మ- యీ రాజగోపాలమ్మ మనుమని చెంగమలదాసుని విక్రాంతి సమయమున అరసి రక్షించి తన ప్రభుభక్తిని ప్రకటించిన దాది - మధుర ఆంధ్రనాయక రాజ్యపాలనమును మహనీయముగ సాగించి దాననిరతిని, ఆంధ్రభాషాభిమానమును అతిశయముగ ప్రదర్శించిన మంగమ్మ- చాందాసాహేబు మోసమునకు గుఱియైన మీనాక్షి- పథ్యముముట్టని పచ్చి బాలెంతరాలయ్యు తన సహగమనోద్యోగము నెఱవేరకపోగా పన్నీరుత్రాగి ప్రాణములు విడిచిన పతిప్రాణ ముత్తమ్మ ప్రజోపయోగమునకై శిశుసహితముగ బలిపోయిన సంగమ్మ వీరల పవిత్రచరిత్రలుగలవు.

దళసరి కాగితములు. 100 పుటలు.
పోస్టుఖర్చులు ప్రత్యేకము. ప్రతి 1–కి అ 8.

కేయూరబాహుచరిత్ర

శిల్పము మెరయ మంచనమహాకవి రచియించిన కేయూరబాహుచరిత్ర అను పద్యకావ్యమును ఆధారముగ తీసికొని తేట తెనుగు వచనమున జనసామాన్యముకొఱకు వ్రాయబడినది. పెండ్లాడినవానిని సార్వభౌమునిగా జేయు వరమునొందిన మృగాంకావళియను నొకరాజకన్యను కేయూరబాహువను రాజునకు నతని ధర్మపత్నిచే భాగురాయణుడను నాతని మంత్రి నిజబుద్ధిబలమున వివాహముచేయించిన వృత్తాంత మిందలి ప్రధానకథ. నడుమ నడుమ చక్కని నీతికథలు పెక్కులు గలవు.

గ్లేజుకాగితములు. 90 పుటలు.
పోస్టుఖర్చులు ప్రత్యేకము. ప్రతి 1–కి అ 8.

ఆంధ్రరాజభక్తులు

రాజభక్తి యనునది దేశభక్తికి పర్యాయపదముగా రాణించుచుండిన ఆంధ్రదేశపు స్వతంత్రయుగ చరిత్రలలో రాణించు రాజభక్తశిఖామణులగు విశ్వనాథనాయడు, యాచమనాయడు, అబ్దుర్ రజాక్ లారీ, కరిబసవస్వామి, తిక్కన మంత్రి, మహాలక్ష్మమ్మ, పాపారాయడు, హనుమప్ప నాయడు అను ఎనమండుగురి చరిత్రలను కీర్తించు గ్రంథము.

గ్లేజుకాగితములు. 112 పుటలు.
పోస్టుఖర్చులు ప్రత్యేకము. ప్రతి 1–కి అ 8.

ఆంధ్రభూమి బుక్కుడిపో, వేపేరి, మదరాసు.

వెడితేతప్పా? ఎవరడ్డొస్తారో చూస్తాను కాదూ! ఇదిగో ఎవరన్నా అడ్డొస్తే చూశావా? నాచేతులో ఏముందో? కొరడాకర్ర '

'నీ కొరడాకర్రేంచేస్తుందిరా, నాన్నా! వాళ్ళదగ్గర తుపాకులుంటాయి.'

'ఓస్! నాదగ్గరమాత్రం తుపాకి లేదా? చెన్నపట్నంనుంచి నాన్న తెచ్చిపెట్టలే.

[పరుగెత్తుకుని లోపలికెళ్ళి పిల్లలాడుకునే తుపాకి తెచ్చి చూపించాడు. తాత నవ్వేడు.]

'అబ్బో! మహాగొప్ప తుపాకిరా నీది!'

'మరెప్పుడెడదాం తాతయ్యా? ...అవునుగాని ... మన నాన్నని దొంగలుండేచోట ఎందుకు పెట్టేరు? ఏమన్నా ఎత్తుకొచ్చేడా?'

'ఛా లేదు.'

'మరేమల్లరిచేస్తే పెట్టేరు కొట్లో?'

'అల్లరేమీ లేదు'

'మరి...'

'మీనాన్న, సుబ్బులు నాన్న, రాముడుగారి బాబాయి, మోహనుడు అన్నయ్య అంతా జండాలు పుచ్చుకుని బజారులో ఊరేగేరు.'

'మనగదిలో పటంమీదనున్న జండాయేనా?'

'అవును. అదే. ఆజండాపట్టుకుని ఊరేగితే పోలీసులు బెత్తాలతో కొట్టి జైలులో పెట్టేరు.'

'జండాలుచ్చుకుని ఊరేగితే తప్పేమిటి తాతయ్యా? నేనల్లాంటి ఊరేగింపు లెన్నో చూశాను. నేను, రాముడు, సుబ్బులు ఎన్నిసార్లు ఊరేగలేదు?'

'అప్పటిసంగతి వేరు. ఇప్పటిసంగతి వేరు. ఇప్పుడు ఆజండాతో వీధిలోకి వెళ్ళకూడదు.'

'నే వెడితే ఏంచేస్తారు తాతా?'

'నువ్వెడితేనా? మెత్తగా తన్ని పోలీసులు కొట్లో పెడతారు.'

'పోనీలే. నాన్నదగ్గిరకు తీసుకెడతారా?'

'వెధవ ప్రశ్నలు చాలెద్దూ... పొద్దుపోయింది పడుకో.'

'నాకు నిద్రరావడంలేదు, తాతయ్యా! రేపు నువ్వొస్తావా, రావా నాన్నదగ్గరకి? నువ్వు నడవక్కరలేదు తాతయ్యా. ఇదిగో నాబండి. ఈకొరడా పుచ్చుకుని ఒక్కటేస్తే నాబండి ఎవ్వారైనాసరే మూడు నిముషాల్లో వెడుతుంది. ఇదిగో నువ్విక్కడకూచో. నేనిక్కడ కూచుంటాను '

[అంటూ మనుమడు ఆడుకునే కర్రబండిని చూపించాడు]

'సరేలే. పడుకో.'

[మనుమడు నాన్నసంగతి ఆలోచించుకుంటూ తాత ఒళ్ళోనే నిద్రపోయాడు-]

౨

[రోడ్డుప్రక్కన అప్పలసామి సంతెద్దుబండి వాల్చిఉంది. ఎద్దు దాణా తింటోంది. నాని, సుబ్బులు, రాముడు, మోహనుడు, ఇంకా ఇద్దరు పిల్లలు కలిసి బండిఆట ఆడుకుంటున్నారు. నాని బండితోలే వాడిచోట్లో కూచుని వెదురుబద్ద పుచ్చుకుని 'చోచో' అంటూ కాడిమీద కొడుతున్నాడు. మిగతావాళ్ళంతా బండిలో కూచున్నారు. అందరూ బలే ఆనందంగా ఆడుకుంటున్నారు. 'ఓయి బండి అబ్బాయి, త్వరగా తోలు రైలుకెళ్ళాలి' అంటున్నారు బండిలోని పెద్దమనుషులు. ఉషారుగా ఉట్టుట్టి బండితోలుతున్నాడు బండిమనిషి నాని. ఇంతలో బీటు కానిస్టేబులు పచారు చేస్తున్నాడు. నాని కళ్ళబడ్డాడు. రాత్రి తాతచెప్పిన సంగతంతా జ్ఞాపకానికొచ్చింది. అప్పుడేలేని కోపంవచ్చింది. గుభాలున బండిమీదనుంచి దిగేడు-]

నాని...ఏమర్రోయి! దిగండి. అదుగో పోలీసు. మన నాన్నని, వాళ్ళనీ కొట్టిందితనే పదండి వాడిపని పట్టిద్దాం. ఏయిపోలీసూ, ఓయి పోలీసూ ..

[పోలీసు వెనక్కితిరిగిచూచాడు. తన్నుకానట్లుగా పోతున్నాడు. పిల్లలంతా 'పోలీస్ పోలీస్' అని అరుస్తున్నారు. పోలీసు బెత్తం ఝుళిపించాడు. నాని వెంటబడి కేకలేస్తున్నాడు.]

'ఏయి పోలీసూ! నిన్నే, పిలిస్తే పలకవేం? చెవుడా?'

'నన్నా? ఎవరబ్బాయీ నువ్వు. ఇంత మొనగాడివి?'

'నేనెవరినో తర్వాత చెప్తాను కాని . . .మా నాన్నని కొట్టింది నువ్వేనా? . '

'మీనాన్నెవరు? మీనాన్న ఎవరూ?'

'మానాన్న నెరుగవ్వూ? మా నాన్న మాబాబయ్య జండాపుచ్చుకుని ఊరేగలేదూ? వాళ్ళని నువ్వేగా కొట్టేవు?'

'ఓహో! వాళ్లా ... లేదబ్బాయి. నే కొట్టలేదు.'

'అబద్ధమాడకు మరి ... నాకు తెలుసునులే. మా తాతయ్య చెప్పలేదూ? అదిగో ఎర్రటోపీ. అది గోకర్ర... అమ్మో ఊలకూడా ఉంది నువ్వే.'

[పోలీసు మొదట తెల్లబోయాడు. తర్వాత సంగతంతా గ్రహించి నవ్వాపుకోలేక పోయాడు.]

'నవ్వుతావేమమ్మా. మావాళ్ళనికొట్టి పైగా నవ్వుతున్నావు కూడానా? ఇదిగో చూసేవా మేమెందరమున్నామో?'

[పోలీసింకా నవ్వుతూ నేఉన్నాడు.]

'మాటాడకుండా నవ్వుతావేమిటి?'

'నేను కాదబ్బాయీ. మీనాన్నను కొట్టిన పోలీసులు వేరే ఉన్నారు.'

'వాళ్ళెవరో చూపిస్తావా నాకు? చూపించకపోతే తెలుసునా మరి. తుపాకీకూడా ఉంది నాదగ్గర.'

[పోలీసు ఒక్కనిముషం ఆలోచించి నానివీపు తట్టేడు]

'అబ్బాయీ: మీనాన్నని కొట్టిన పోలీసుల్ని రేపు చూపిస్తాను కాని ఇంటికెళ్లు.'

'రేపెప్పుడు?'

'ఈవేళప్పుడే, ఇక్కడికే రా'

౩

[సాయంత్రం 5 గంటలకు గుమ్మం ముందర నాని, సుబ్బులు, మోహనుడు ఇంకా పిల్లలంతా కట్లాట ఆడుకుంటున్నారు. గిరిగీసి గిరిలో నాని తిరుగుతున్నాడు. చుట్టూ ఆకులకట్టలు చెల్లాచెదరై ఉన్నాయి. నానిని పిల్లలంతా కవ్విస్తున్నారు. ఇంతలో వందేమాతరం ధ్వనులు చెలరేగినాయి. అంతా ఆటకి బొడ్డుతుంబాలు పెట్టి, వీధిగుమ్మంలోకొచ్చి నిలబడ్డారు. 4 గురు మనుష్యులు గాంధీ టోపీలెట్టుకుని జయజయ ధ్వానాలు చేస్తూ జండాలు పుచ్చుకుని ఊరేగుతున్నారు. ఎదుటనుంచి పోలీసులు మోటారుబస్సులో వచ్చి వాళ్ళని బెత్తాలతో కొట్టి బస్సులో పడేసుకుని చక్కాపోయారు. పిల్లలంతా తెల్లబోయి చూచారు.]

నాని—ఒరే రాముడూ, పోలీసు లెల్లా కొట్టేరో చూశావురా?

రాముడు—చూశాను. మీ నాన్ననీ మానాన్ననీ అందర్నీ ఇల్లాగే కాబోలు కొట్టింది.

నా—అవును. మా తాతయ్య చెప్పలేదూ మరి.

రా—జండా పుచ్చుకుంటే పోలీసులకంత భయమెందుకురా? ఏంతప్పా?'

నా—ఏమోమరి. జండాపుచ్చుకొని వీధిలోకెళితే తప్పని చెప్పేడు తాతయ్య.

మోహనుడు—అవునుకాని, వాళ్లు నలుగురున్నారుకదా. వెనకాల ఎంతో జనమున్నారు. మళ్ళీ తిరుగబడలేదేమిరా? మనమయితేనా?

రా—గాంధీశిష్యులు అల్లాచెయ్యకూడదట్రా. మా అమ్మ చెప్పింది.

నా—అవును మాతాతయ్యకూడా అల్లాగే చెప్పేడు.

రా—సరేకాని, మనమిల్లా ఊరేగితే ఏమవుతుందిరా?

నా—మన్నీ ఇల్లాగే కొడతారు.

మో—కొడితే లెక్కా? తర్వాత మనవాళ్లున్నచోటికి తీసుకెడతారుగా?

నా—అవున్రోయి. ఏమైతే అవుతుంది. మనంకూడా ఊరేగుదాం. ఎవరొస్తార్ చేతులెత్తండి.

[అంతా చేతులెత్తేరు.]

సరే. కొడితే ఏడవకూడదు సుమా

రా—ఓస్. అల్లాగేలే. నువ్వేమిటి మహా.

నా—అయితే మానాన్న గదిలో జండా పట్టుకొస్తాను. ఎవళ్ళతో చెప్పకండి. తాతకి తెలిస్తే తంటావస్తుంది. రేపుసాయంత్రం బడివిడిచిపెట్టే వేళకి సైయేనా?

అంతా—ఆహా.

౪

[నాని, రాముడు, మోహనుడు, సుబ్బులు, శివుడు ఇంకా నలుగురైదుగురు

[మిగతా ౧౨౯-వ పేజీలో.

పెద్దాపురపు యోజనగంధి

[చిన్న కథ]

'ఆమె ప్రౌఢ ఐనా పసివానిని ప్రేమించింది. ఆపసివాడు పరువంగల యౌవనుడై ఆమెను కామించాడు. తుదకు పునస్సంధానమైంది.'

రచయిత:

కొత్తపల్లి శ్రీరామమూర్తి, యల్.యమ్.ఇ.

వీధితలుపు తట్టేసరికి ముసిముసి నవ్వు నవ్వుకుంటూ వచ్చి యింటి యజమానురాలు తలుపుతీసి 'ఏమండోయ్, సుందర్రావుగారూ! మీప్రక్కగదిలోకి కాపరానికి వచ్చారండోయి' అంది.

మనకి పొరుగుచేరింది, మేడ మెట్లు కాస్త శుభ్రంగా వుంటా యనుకుంటూ ఆగదిలో నివసించ డానికి వచ్చినవ్యక్తి ఎవరో, ఎటు వంటివాడో తెలుసుకుందామన్న ఆతురతకొద్దీ ఒక్క అంగలో మేడ మెట్లు ఎక్కేశాను.

ఆగది మూసేవుంది. ఎవరూ కనుపించలేదు. నాగదితలుపు తీశా ను. తీసి లోపల ప్రవేసించేసరికి ఏదో అద్భుతమైన పరిమళం విర జిమ్మినట్టయింది. ఇటువంటి పరి మళద్రవ్యాన్ని ఉపయోగించే వ్యక్తి స్త్రీయే అయివుండా లనుకు న్నాను.

స్త్రీ అని ఎప్పుడు మనస్సునిశ్చ యించినో ఆమె ఎట్లుంటుందో చూదామని తోచింది. కోటుతీసి చిలక్కొయ్యను తగిలించి తలుపు సందులోనుంచి చూశాను. ఏమీ గోచరంకాలేదు.

ఆమె ఏంచేస్తోందో అని చెవు లు నిక్కించి విన్నాను. కాని గది అంతా నిశ్శబ్దంగానేవుంది. ఏవిధ మైన అలికిడీలేదు.

కాని, క్రిందిభాగంలో యింటి యజమానురాలి గొంతు వినప డింది. ఎవరినో 'వున్నారు, రం'డని ఆహ్వానిస్తోంది. ఆమాట చెవిని బడేసరికి నాస్నేహితులను పేకాటకి రమ్మన్నమాట జ్ఞప్తికివచ్చింది. నేనుకూడా వాళ్ళకు ఎదురు వెళ్లా ను- స్వాగతమియ్యడానికి మేడ మెట్లుదిగి.

మాపక్కగది పరిమళం ము క్కుకి సోకగానే కృష్ణమూర్తి నిశ్చేష్టుడై నిలబడిపోయాడు. అతని ముఖం వాడిపోయింది. శరీరం వణికిపోతోంది. నోటమాట రా లేదు.

ఆస్థితిచూస్తే మాకు భయం వేసింది. 'ఇదేమిరా కృష్ణా' అని రెక్కపట్టుకుని తీసుకొచ్చి అతన్ని పడక్కుర్చీమీద కూచోబెట్టాను.

కొంతసేపటికి కృష్ణుకు కొంత ధైర్యంతెచ్చుకున్నట్టు కనిపిస్తూ జేబురుమాలుతీసి ముఖం ఒక్క సారి నొక్కి తుడుచుకున్నాడు'ఇదే మిటో చెప్పడం తీరామొదలుపె ట్టాక మీరు ఎక్కిరిపిస్తే నాహృ దయం వికలమైపోతుంది. ఆవిఘా తానికి తాళుకోలేను' అన్నాడు, జాలిగా.

'మేమెవ్వరం నవ్వమని' అందరి తరఫునా వాగ్దానంచేశాను.

కృష్ణమూర్తి గొంతు సవరించు కొని తనగాథచెప్పబోయాడు. కాని ముక్క పెగలలేదు. కంగారుపడి వూరుకున్నాడు. కొంచెంసేపు ఆగి 'ఎక్కడ మొదలుపెట్టాలో నాకు తోచడంలే'దన్నాడు.

'నీ ఉత్సుకతతో మొదలుపెట్టు' అన్నాను అని ఊతంగా 'ఒకే, నీకు పెద్దాపురందగ్గర పెద్దాపురం రాజులకోట వుంది ఎరుగుదువా? ఆ కోటవున్న కొండకి మూడామడల దూరాన ఏటివడ్డునవున్న ఒక కుగ్రామంలో పుట్టాడు. ఆగ్రామం చుట్టూ పొరంబోకులు విశాలంగా వున్నాయి' అని కథకు ఉపోద్ఘాతం మొదలుపెట్టా అతనికి దారి చూపినట్టుగా.

దానిని అందిపుచ్చుకుని కృష్ణమూర్తి యిట్లా చెప్పసాగాడు.

'దాన్ని కుగ్రామం అనేకన్న పల్లెఅంటే బాగుంటుంది. ఆపల్లె పేరు అధరాపురం. మాఅయ్య రోజూయాయవారానికి వూరూరా తిరిగేవాడు. దొరికినబియ్యం అర్ధో, పావులావో అమ్మకిచ్చేవాడు. ఆమె ఉన్నదాంట్లో క్లుప్తంగా సంసారంగడిపేది. నేను వారికి ఏకైక సంతానం.

రోజూ మాతండ్రిని నన్నుకూడా తీసుకెళ్ళమనేవాణ్ణి. కాని మాతల్లి నన్ను వెయ్యికళ్ళతో చూచుకునేది. నన్ను విడిచిపెట్టి వుండటానికి యిష్టపడేదికాదు.

ఇల్లావుండగా ఒకసారి గణపతినవరాత్రిళ్లకి పెద్దాపురంలో పెద్ద ఉత్సవాలు జరుగుతున్నాయి. మావూరివాళ్ళందరూపోయి చూచివచ్చి గొప్పగా చెప్పుకునేవారు. ఈసారి తప్పకుండా వెళ్ళాలని నిశ్చయించుకున్నాను. మానాన్నని అడిగా, తీసుకువెళ్ళమని. ఆలాగే నన్నాడు.

అది ఆఖరిరోజు. ఆవేళ ఏనుగుమీద వూరేగింపన్నారు. ఆరోజున నన్ను తీసుకువెడతానన్న మానాన్నగారు పనిమీద పక్కవూరు వెళ్లారు. సాయంకాలం ఆరుగంటలైనా రాలేదు. నాకు కడుపులో ఆరాటం బయలుదేరింది. మాఅమ్మతో చెప్పి వెడదామంటే ఆమె పోనీయదు కాబట్టి చెప్పకుండా ఉడాయించాను. అదే పరుగు. పెద్దాపురం జేరాను.

ఉత్సవం మంచి జోరుగావుంది. భజనలు, భోగంమేళాలు, బుట్టబొమ్మలు బేండుమేళాలు ఒకటేమిటి కన్నులవైకుంఠంగావుంది ఉత్సవం బజారువీధినుంచి భోగంవీధికి మళ్ళింది సానివీధిఅంటే స్వామికికూడా ప్రీత్యేకాదుమరి. ఆటపాటలు ద్విగుణీకృతోత్సాహంతో విరాజిల్లుతున్నాయి.

ప్రకృతిమాత పులకితగాత్రియై హర్షబిందువులు రాల్చుచున్నదా అన్నట్టు ఆసమయంలో చిన్న చిన్న తుప్పరపడసాగింది.

కుంభవృష్టిగా వర్షంకురిసింది. ఎక్కడివారక్కడ ఎగిరిపోయారు నాకట్టుకున్న లాగు, చొక్కా కొంచెంగా తడిశాయి. కాని ఎక్కడికి పోవడానికి తోచిందికాదు. సమీపాన్నివున్న ఒక అరుగుమీద జేరాను. చలిగాలి విసరసాగింది. చలికి వణకడం ప్రారంభించాను. ఇంతలో ఆయింటినుంచి ఒక యువతి తొంగిచూచింది. అప్పుడు అపూర్వమైన సువాసన గుప్పుమంది.

ఆమె నాదీనస్థితిచూచి జాలిపడింది కాబోలు. లోపలికిరా అబ్బాయి అంది.

ఆమాటలో మాధుర్యముంది. బయటనున్న యీదరగాలికి తాళలేక లోపలికి వెళ్లాను ఎవరిఅబ్బాయివి నాయనా అంది. నాకు నోటమాటరాలేదు. ఇంటిదగ్గ చెప్పకుండా వచ్చానన్న భయమూ, ఏమి చెపితే ఏమివస్తుందో అన్న భయమూ రెండూ వేధించాయి.

పరుగెత్తుకువచ్చినందువల్ల ఆకలిమంట కడుపులో దహించుకుపోతోంది.

భయంలేదులే నాయన చెప్పు అని నన్ను దగ్గరగా తీసుకొన్నది' అని కృష్ణమూర్తి ఒక నిట్టూర్పు విడిచాడు.

'అమ్మయ్యా అసలు కథాఘట్టానికి వచ్చా'మన్నాడు శాస్త్రి.

'వూరుకో చెప్పనీయరా పానకంలో పుడకలా మధ్యమధ్యన నీపిల్లసమ్మోరేమిట్రా' అన్నాడు విసుగుతో మోహనరావు.

'నన్ను దగ్గరగా అదుముకున్నప్పుడు నాచొక్కా చల్లగావుందని ఆమె తెలుసుకొని దానిని తీసివేయమంది. తీసివేశాను. నీకు ఆకలిగావుందేమో కొంచెం అన్నం పెడ

గా తింటావా అంది. వాళ్ళు ఎవళ్లో అన్న సంశయం నామనస్సులో పరుగెత్తింది. తింటే ఏంతిప్పో అని వద్దన్నా.

పోనీ కొంచెం పలహారం చేయి అని తియ్యబూంది ఒక పింగాణీ పళ్ళెంలో పెట్టి తీసుకొచ్చి బల్లమీద పెట్టింది.

కడుపులో కాముడు గంతులేస్తున్నాడు ఇక గునిస్తే లాభం లేదని ఉపక్రమించాను.

నోటిదగ్గర పెట్టుకున్నాను. అది సామాన్యమైన తీయబూంది కాదు. పూదేనెలో వేసిన తీయబూంది. దానిమాధుర్యం ఏమని చెప్పను?

బయట వాన వెలిసింది. ఎవరో వచ్చి ఆమెతలుపు తట్టినారు. ఇప్పుడు వీల్లేదు పొండని గదిమింది

నిశరాత్రి అయిందనుకుంటాను. పడుకో నాయనా అంది ఒకమంచం చూపి. అప్పుడు ఎక్కడికి పోదామన్నా దారిలేకనూ, ఆమె ఆదరణకు ఆనందపరవశుడనైయ్యున్ని ఆమంచంమీద పడుకున్నాను. అది నాకు హంసతూలికాతల్పంలా కనుపించింది. మొహమల్ గుడ్డతో కుట్టిన దిండ్లు చాలా మృదువుగా వున్నాయి.

అలసివుండటంవల్ల చప్పున నిద్ర పట్టిపోయింది. కాని నగంరాత్రి వేళ మెలుకవవచ్చింది. బయట ఉరుములు, మెరుపులు హృదయవిదారకంగావున్నాయి. నాఅమ్మ జ్ఞాపకంవచ్చింది. భయంచేత కెవ్వున కేకపెట్టాను. నాకేకవిని ఏమి నాయనా అంటూవచ్చి నామంచంమీద పడుకుని నన్ను దగ్గరగా అనుముకుని పడుకుంది ఆమె. భయంలేదు పడుకోమంది.

ఆమెస్పర్శ తగలగానే సర్వము మరిచిపోయాను ఏదో ఆనందవాహినిలో యీదులాడినట్లైంది.

'ఆమె మాంత్రికురాలై వుండాలి', అన్నాడు శాస్త్రి

'మళయాళమంత్రాలు నేర్చుకుందేమో' అన్నాడు వేరొకమిత్రుడు.

నేను ఇవి ఏవీ వినిపించుకోకుండా కథ మళ్ళీ ప్రారంభించాను.

'మరునాడు సూర్యోదయం కాకుండానే లేచింది. పాలుకాచి తెచ్చి నన్ను లేపింది. దంతధావనం చేశాక ఆపాలు పుచ్చుకోమంది. తరువాత బలవంతంమీద నా సంగతి అంతా కనుక్కుంది.

వెర్రిపిల్లాడా అంటూ బండి ఒకటి కట్టించి మావూరు తీసుకువెళ్ళింది మా అమ్మా, నాన్నా నాకై వూరంతా వెదకిస్తున్నారు. నన్ను గుమ్మంలో చూడగానే మాఅమ్మ గబగబావచ్చి ఎక్కడికి పోయావు నాయనా అని కౌగలించుకుంది.

మావాళ్లు ఆమెను కొంచమైనా గౌరవించలేదు సరిగదా ఎవరునీవని అయినా అడగకుండా తలుపులు మూసేసుకున్నారు, కోపంగా చూస్తో, నన్నులోపలకి లాక్కుని మావాళ్లు. నన్నింత ఆప్యాయంగా ఆదరించిన స్త్రీమూర్తికి చేయవలసిన సత్కార మిదా అని నాకు పట్టరానికోపంవచ్చింది.

ఇంటికివచ్చినా నామనస్సు ఆమెనుండి తిరిగి నావశం కాలేదు. సర్వకాల సర్వావస్థలయందు ఆమె స్ఫురణకు వచ్చేది ఆమె ఆదరణ, ఆనువాసన, ఆవిలాసము ఎంతప్రయత్నించినా మరపునకు రాలేదు.

తిరిగి ఆమెనుచూడాలన్న అభిలాష అంకురించింది. రాత్రిళ్లు నిద్ర పట్టేదికాదు. ఆమెకై విలపించేవాణ్ణి. కాని నా విలాపము వినేవారెవరు? నాలో నేను కుళ్ళిపోయేవాణ్ణి.

నాయీ పరధ్యానం కనిపెట్టి 'కాబోలు మాఅమ్మ నన్నువూరికే కోప్పడేది

ఆమె సరసన మాచేసరికి నన్నంతగా ఆదరించిన ఆ ప్రేమమూర్తి సాన్నిధ్యాని కెందుకు పోగూడదనిపించేది. తిరిగి యిల్లువిడిచి పారిపోదామా అనుకునేవాణ్ణి.

ఆలా రెండేళ్లుగడిచాయి. విజృంభించిన ఆభావానికి హృదయ ముప్పొంగ ఒకనాడు తిరిగి పెద్దాపురం ఉడాయించాను.

కాని అయింటితలుపులు బంధింపబడివున్నాయి. నాకు అప్పుడు అశ

నిపాతము ఐనట్టు అయింది. ఎక్కడకిపోయిందో తెలుసుకుందామంటే యింట్లో మరి ఎవరూలేరు. తాళంవేసివుంది యిల్లు' అంటూ కృష్ణమూర్తి ఒక్క పెద్దనిట్టూర్పు విడిచాడు.

ప్రక్కగది తలుపులు తిరిగి కిరుకిరుమన్నాయి. సువాసన మరల వ్యాపించింది.

ఏమిటదన్నాడు శాస్త్రి.

'ఆమె తిరిగి వచ్చింది అన్నాడు' పద్మనాభరావు.

తిరిగి' కృష్ణమూర్తి ముఖం విహ్వలమైపోయింది కత్తివేసినా నెత్తురుచుక్క రాలేటట్టు లేదు.

మళ్ళీ దీనంగా యీలా సాగించాడు కృష్ణమూర్తి.

'నాకు అర్థంకాదావాంఛ. ఎందుకు ఆమెను చూడాలని వుందో తెలియడంలేదు. ఆవాంఛ నాహృదయంలో నిద్రపోతూవుంది. కాని అప్పుడప్పుడు అకస్మాత్తుగా స్ఫురణకువచ్చి హృదయాన్ని బ్రద్దలు కొడుతుంది.

ఆమె విగ్రహం, ఆమె చేష్టలు నాకంటికి కట్టినట్టు కనుపిస్తాయి. ఎప్పటికేనా ఆమె పునర్దర్శనం కలుగుతుందని నా అంతరాత్మ ధైర్యంచెబుతూవుంది. ఆసువాసన తగిలేటప్పటికి ఆమె అందుబాటులోనే వున్నదనుకుంటాను. అదే నన్ను వూపేస్తుంది.

ఆసువాసన రాగానే ఆమె అయివుంటుందనుకుని తలుపుగొట్టి చూడామనుకున్నాను. కాని ధైర్యం లేకపోయింది. శక్తి సన్నగిలిపోయింది. వేరేదారిలేక ఖిన్నుడనై యిక్కడ చతికిలబడ్డాను.

నేను కనుక్కొస్తానని ధైర్యం చేసి ఆమె తలుపుతట్టాను.

'ఎవరువారని' లోపలనుంచి కోకిలస్వరం వినిపించింది.

'నేనండి' అన్నాను.

'నే నంటే'

'మీప్రక్కగదిలో కాపురము. న్నాను. నేనండి'అన్నాను తిరిగి.

ఆమె తలుపుతీసింది. ఒకమూల టేబిలుమీద టేబిల్‌లాంపు కునుకుతోవుంది.

ఆమె చరచరా అటువెళ్ళి దీపం హెచ్చించింది.

నాకేసి తీక్షణంగా పరిశోధించినట్టు చూసింది.

'మీ దేవూరండి' అన్నాను

'మాది పెద్దాపురం. మీది' అన్నది.

మాదీ అవూరేకాని బాల్యంలోనే ఆవూరు విడిచి వచ్చాను అన్నాను.

'అయితే ఎందుకువచ్చారూ' అంది.

'మీరు మావూరివారని తెలిస్తే చూదామని వచ్చా'నన్నాను.

నన్ను యౌవనంలో చూచిన వారిని ఎవరినీ చూడ్డం నాకిష్టంలేదంది.

ఇట్లాఅంటూ ఆమె కప్పుకున్న శాలువా జారవిడిచింది. మంచం మీద కూచుని నాకోకుర్చీచూపింది కూచోమని.

ఆమెతో మాటలాడుతూ గది నాలుగుమూలలు పరికించాను. ఒకమూల బల్లమీద పెద్ద తేనె సీసా కనుపించింది. ఒకసీసాలో సారపప్పు వున్నది.

రహస్యం భేదించినట్లు లోలోపల సంతసించాను.

'మావాడు మిమ్మలనుగూర్చి చాలా చెప్పా'డన్నాను.

'ఏమని' అంది.

'కరుణార్ద్రహృదయులనీ, చాలాసుందరులనీ, చూచితీరాలనీ అన్నాడు.' అని జంకుతూ చెప్పాను.

'నేనా? ఎవరన్నారు అంటూ' నవ్వసాగింది.

'ఆనాడు బాలుడు, ఈనాడు యువకుడు- లెండి' అన్నాను ఆమె నవ్వువల్ల ధైర్యంతెచ్చుకుని.

'అందాన్నిగురించి పిల్లలకేం తెలుసోయి పిచ్చివాడా? ఎవరుఆదరిస్తే వారే అందమైనవాళ్లుగా కనుపిస్తారు. అవునా?'అంది.

'ఒక కుర్రవాడు మీయందు బద్ధానురాగుడై వున్నాడు. అది మీకు తెలియదేమో?'

'కుర్రవాడా? నన్నా! ప్రేమిం చాడా. నీవు అసందర్భంగా మాటా డుతున్నట్టుంది' అంటూ పకపకా నవ్వింది.

'మీకు జ్ఞాపకం వుందో లేదో– ఒకనాటిరాత్రి మీకు అతిథి. మీ రతనికి తేనెలో వేసిన తీయబూంది పెట్టారుటకూడాను? అతడు మిమ్మ చూడగోరుతున్నాడు.'

ఆమె ఒక్కక్షణం నిశ్చేష్టురా లైంది. కంపితురాలైంది. తిరిగి శాలువ వంటినిండా కప్పుకుంది. నేను మీకు తలుపుతీయడమే తప్పని విసుక్కుంది.

ఆతడు మిమ్ములను చూడకోరు చున్నాడు. ప్రక్కగదిలోవున్నాడు మీరు అవునోకాదో చూచి రమ్మ న్నాడు నన్ను అనుమతియిస్తే తీసుకు వస్తా.

'ఇదికలా?' అన్న మాటలు ఆమె పెదవులనుండి జారినవి.

'కలకాదు, సత్యమే. అతడుసర్వ కాల సర్వావస్థలయందు మిమ్మను గూర్చే కలలు కంటున్నాడుట. మిమ్ములను చూడాలన్న కోరిక. కాని భయం.

'నాకైే గాఢమైన వాంఛా! కాని భయమా? ఆహా! ఆరాత్రి తిరిగిరాదుకదా!' అని ఒకనిట్టూర్పు విడిచి. 'అతనిని తిరిగి చూడాలన్న వాంఛ నాకూవుంది. కాని వళ్ళు కంపిస్తోంది భయంగావుంది ఆపాదమస్తకం శరీరం వణికిపోతోంది' అంది.

'ఇద్దరికీ భయంపోతుంది పిలవనా' అన్నాను.

'వద్దు' అని మంచంమీదనుంచి చివాలునలేచింది.

'ఇక్కడ చూడటం నాకిష్టం లేదు. వానిని చూచి సహించలేను. నన్నుచూసి భయపడేవాణ్ణి ఇక్కడ వంటరిగా చూచి లాభమేమిటి? వద్దు ఇక్కడికి పిలవ్వొద్దు' అంది.

'అయితే ఏంచెప్పను వానికి?' అన్నాను.

'నేను ఆనాటి స్త్రీనికానని, నా లావణ్యమంతా దానంచేసేశానని. యౌవనంయిగిరిపోయిందని, యిప్పుడు మిగిలిందంతా స్థూలమైన శరీరంమాత్రమని చెప్పు చాలు' అని ఏడ్వసాగింది. కళ్ళను రెండు చేతులతో మూసుకుంది.

ఆమె విచారం చూడలేక చివాలునలేచి వెళ్ళిపోయాను నా గదికి.

కృష్ణుడు అతురతతో చూశాడు. ఏంజరిగిందన్నాడు. జరగడానికేముంది?

'ముసలి లావుపాటి తొక్కనని' చెప్పమంది.

ఆమాట కతడు చేష్టలుడిగి కొయ్యబొమ్మలా అయిపోయాడు.

అప్పుడు రాత్రి తొమ్మిది గంటలైంది. అతనివాలకం చూచేసరికి మాకు కంగారు పట్టుకుంది.

కాని ఆమె చరచరా మెట్లు దిగి వెళ్ళిపోతోంది. సువాసన ఆమెను వెంటాడిస్తోందా అన్నట్టు గదిలో మామూలుగాలి ప్రవేశించింది.

ఆమె పోవడంచూచి చివాలున లేచి ఏమీ చెప్పకుండా వెళ్ళిపోయాడు కృష్ణుడు.

ఎక్కడికిపోతున్నాడో అని లేచి కిటికీలోనుంచి చూచాం. ఎదురుగా బస్సుస్టాండువద్ద వారిద్దరు కనుపించారు ఎక్కడనుంచి వచ్చిందో ఒక బస్సువచ్చి ఒక్క క్షణం అక్కడ ఆగి బుర్రుమంది.

మళ్ళీ వాళ్లు కనుపించలేదు.

విజ్ఞానవిషయాలు

బృహస్పతిగ్రహంయొక్క మధ్యరేఖ నిడివి 86,500 మైళ్లు. కాబట్టి గ్రహాలన్నిటిలోకి అది పెద్దది. బుధగ్రహంయొక్క వ్యాసరేఖ నిడివి 3030 మైళ్లు. కాగా అది గ్రహాలన్నిటిలోకి చిన్నది.

... ...

మాగెలన్ అనేవాడు 1521-వ సంవత్సరంలో పసిఫిక్ మహాసముద్రానికి ఆ పేరు ఇచ్చాడు.

... ...

ఇంగ్లండులోకి పదహారో శతాబ్ది నిరిభాగంలో మొదటిసారి బంగాళాదుంపలు కొనిరాబడ్డాయి.

... ...

ఇంగ్లండులో పెన్నీ పోస్టేజి 1840 జనవరి 10-వ తేదీని ప్రవేశపెట్టబడింది.

పల్లెపదాలు

[వీనిని సేకరించినది శ్రీ దేవగుప్తాపు వెంకటరమణమూర్తి పంతులుగారు. వీనిని వరి ఊడ్పులలో విశాఖపట్టణం మండలంలోని స్త్రీలు పాడుతారు. 'రామనా చందినాలో' అనుపల్లవి ప్రతి చరణము మొదటను పాడుచుండాలి.]

నోమినోమల్లారా నోమన్నలారా
దారితలపాలమారాయే దగ్గరిల్లారాయే
ఏవేళ వెలమడికీ పైయింటనిద్రా
కోశికోశెలమోడూ వేశ్యళ్ళకెళ్ళే
వెయ్యర్ర వెలమడికీ వెండిమంచాలు
వెండిమంచలుమాకు వెయి వేలు
గలవ్వూ [లూ
వెయ్యండి వెలమడికీ నులకమంచా
నులకమంచములు మాకు నూర్వే
లు గలవ్వూ [లూ
వెయ్యండి వెలమడికీ పట్టిమంచా
పట్టిమంచలుమాకుపది వేలుగలవ్వూ
సాలూరుసన్నాలూ ఆపరుపుపయినీ
పట్టిమంచము వేశీ పరుపమర వేశీ
సాలూరుసన్నాలు ఆపరుపుపయినీ
అత్తరువు పన్నీరూ ఆపరుపుపయినీ
జాజికాయ జాపత్రీ ఆపరుపుపయినీ
ఆకులే చక్కలే ఆపరుపుపయినీ
పువ్వులే పుష్పాలే ఆపరుపుపయినీ
పరుపుమీద పందుము మల్లెలేబోసీ
మల్లెలెత్తకుండా ఒల్లెలోబోసీ
ఒల్లెలెత్తకుండా ఓడంబరాలూ
నాల్గుకోళనునాల్గు దివనాటకాలూ
వేసెనే వెలమోడూ సరిపానుపెక్కీ
మాటమీదమాటొచ్చీ మరికయ్యమొచ్చీ
అద్దిమద్దీ రేయి నిద్దురారేయీ
నిశారాత్రీవేళా నిద్దురారేయీ
వెళ్ళవోయి వెలమోడా వెల్లులి
కంపూ
పోవోయి వెలమోడా పొగజిడ్డు
కంపూ
లేవోయి వెలమోడా నీరుల్లికంపూ
ఎర్రనీ కళ్ళకీ ఎత్తె కోపంబూ
నీలాలు కళ్ళకీ నిండెకోపంబూ
వెలమడెళ్ళినత్రోవ వెన్నెలాకాసే
వెనకదిరుగక వెలమడెళ్ళిపోయ్యే
డూ
కాళ్ళచెప్పులుజూచీ కాళ్ళశిరిజూచీ
నాతి వెలమడుకొడుకూ నేలబోని స్త్రీ
మునిచేతికంకణామూ ముందుటుంగ
రమూ [నిస్త్రీ
నుపిద వెలమడుకొడుకూ నేలబో
నడుముకట్టూజూచీ నడుముతీరూ
జూచీ
నాతి వెలమడుకొడుకూ నేలబో
నిస్త్రా
చేతికడియముజూచీ చెయితీరుజూచీ
చేడె వెలమడుకొడుకూ నేలబోని
స్త్రీ
మేడదిగివచ్చింది మేళంపుకన్యా
పట్టెమంచముపరుపూవిడచిపెట్టిందీ
నులకమంచము వేసీ పండుకున్నాదీ
తమపాలమతిరిగొచ్చీ తన అన్నలొ
చ్చీ
చెల్లెలూవద్దకూ చేరిబల్కేరూ
యీడుజోడులవారూ ఏమిటన్నారే
చెలికాళ్లుయేమనీ చేరిఅన్నారే
నీవదినె మరదళ్లూ ఏమిటన్నారే
అన్నరో మాఅన్న నా అన్నలారా
నావదినె మరదళ్లూ నన్నేమనన
లేదూ
పెరటిలోకెళ్లేనూ పాముకరిచిందీ
పాముపొడిచినమాట లన్నలాలించీ
దానేగురన్నల్లూ ఏడుబొరిగిల్లూ
దానేగురొదినల్లూ ఏడుతిట్టల్లూ [రు
భుజమునా గొడ్డళ్లూ బూనుచున్నా
వెళ్ళిరీ అన్నల్లూ నల్లకొండలికీ
వెళ్ళి నేరడుతోనూ అన్నల్లుగట్టీ
అల్ల నేరడితోనూ చల్దిలే గట్టీ
గొడ్డళ్ళతోకొండ గొట్టుచున్నారూ
వాకేరు బలుసేరూ వదలివేసేరూ
చెట్లమూడికలల్లా చెల్లదవ్వేరూ
కొండమూడికలల్లా కొల్లదవ్వేరూ
వేళ్లుబట్టుకూనీ వచ్చెనన్నల్లూ
తూర్పుకీ పడమరికీ సన్నలేసేరూ
దానేగు రొదినల్లా ఏడుసన్నెల్లూ
సన్నలేసుకు మందూ నూరుతున్నా
రూ
నూరేటిసన్నలే నురగలేగమ్మే
ఆవెండిగిన్నెల్లా మందు తేగలపే
పాలనీ యిచ్చేరే పట్టిమందుల్లూ
వెన్ననీ యిచ్చేరే వెండిమందుల్లూ
కుంద్రడగిన్నెల్లోనే కలిపిమందుల్లూ
కూడానియిచ్చేరేకొన్నిమందుల్లూ
మోందులూ క్రిందాయే కష్టమెచ్చా
యే
కష్టమెచ్చయినారే కానికోయించీ
కష్టాలుగావమ్మా కాముడేమరులూ
దిష్ట నీవారమ్మా దివదృష్టిదీసీ

దిష్టి లేగావమ్మా దీనుడే మరులూ
మరులూకొనీనాతీ మంచ మెక్కిందీ
వెలమోడు చెల్లెళ్లూవచ్చెమరదళ్లూ
అల్లంతదూరమునా మరదళ్ళజూచీ
పుచ్చుకుంటే పుస్తేపేరులిస్తానూ
అందుకుంటే ఆశిముత్యాలిస్తానూ
వెలముడుని ఒకసారి రమ్మనిచెప్పూ
వాకిటను మంచములూ వాలేశినా
రూ
కాటికీ కర్రల్లూ తోలించినారూ
ఏటికీ నీళ్లాకి పంపించినారూ [నూ
కష్టముగానున్నానూ చచ్చిపోతా
వేగముగ మరదళ్ళూ అన్నకడకెళ్లీ
రచ్చలో కూర్చున్నా రాజు వెలమ
న్నా
సానివి మావదెనే చచ్చిపోతుందీ
వేశ్యది మావదెనే వెళ్ళిపోతుందీ
వాకిట మంచాలూ వాలేశినారూ
కాటికీ కర్రల్లూ తోలించినారూ
నిన్ను వక్కమారూ రమ్మనీ చెప్పే
ఆమాటవిన్నాడూ అన్న వెలమన్నా
వెల్లుల్లితోటలికీ వెలుగు పెట్టాలీ
రాతీరదనిజెప్పే మీావదెనెతోడా
నీరుల్లితోటలికీ నీసుకట్టాలీ
రాతీరదనిజెప్పే మీావదెనెతోడా
పొగతోట చెట్టులకీ బోదలెత్తాలీ
రాతీరదనిజెప్పే మీావదెనెతోడా
చచ్చిపోయిందన్నా కబురు విన్నా
డూ [డూ
నాతిమీాదనుప్రేమా దియ్యకున్నా
అమ్మగోమాయమ్మా నను గన్న తల్లీ
ముత్యాలు రాసులికీ కొలవేసినానూ
ముత్యాలురవధూళీ నామిాద బారే
ముత్యాలు నాకురులా నీళ్లు పో
య్యాలీ

కొడుకురా ఓకొడుకా నను గన్న
కొడుకా
నిన్నగాకనుమొన్నా నీళ్ళస్నానము
రా [మురూ
కొప్రవి డీనలుగూ గొట్టముల చ
నిన్నగాకనుమొన్నా పాలస్నానము
రా [మూసే
ముత్యాలు నీకురులూ ఎంతలో
అమ్మగో మాఅమ్మా నను గన్న తల్లీ
పగడాలు రాసులికీ కొలవేశినానే
పగడాలురవధూళీ నామిాద బారే
పగడాలు నాకురులు నీళ్లు కావాలీ
నిన్నగాకనుమొన్నా పాలస్నానము
రా
పట్టొంటి నీకురులూ ఎంతలో మూసే
పడతిమీాదనుప్రేమా తియ్యకుంటే
నూ
పదివేలు చేసూనే పట్టుపచ్చడమూ
పక్కకాలీనప్పూ డేయరాకొడుకా
నువిదమీాదను ప్రేమ దియ్యకుంటే
నూ [రమూ
మునిచేతికంకణమూ ముద్దుటుంగ
నువిదకాలీనప్పూ డేయరాకొడుకా
నాతిమీాదనుప్రేమా తియ్యకుంటే
నూ
నాల్గు వేలూ చేసూ నీనడుముదట్టీ
నడుముగాలీనప్పూ డేయరాకొడు
కా [లూ
వెయివేలుచేసునూ యల్ల పుట్టము
వెన్నుగాలీనప్పూ డేయరాకొడుకా
నూనెతే పంపించీ నూరుకావిళ్ళూ
పసుపులే పంపించీ పదియుకావిళ్ళూ
కుంభములుపంపించీ నూరుకావిళ్లూ
భరిణలేపంపించీ పదియుకావిళ్లూ
నేతులేపంపించీ నూరుకావిళ్ళూ

నుదురుగాలీనప్పూ డేయరాకొడు
కా
ఆకర్ర యీాకర్ర అగ్నిరాదేసీ
వెలమడిని చూచిందీ యెగిరిపో
యిందీ

౨

గుడివాడచాకీతా కూడుదండొచ్చీ
కుడిచేతిసీ గిన్నే పట్టుకున్నాదీ
ఎడమచేతిని మడతా పట్టుకున్నాదీ
ఎగువీధి చాకీతా దిగువీధికొచ్చీ
దిగువీధి చాకీతా ఎగువీధికెళ్ళీ
మైలబట్టలుదండీ మైలేధినేశీ
బట్టలన్నీదండీ ఓవులేసిందీ
బాగుగా గాలేసే బొడ్డుకొంగొసిలీ
పడమరగా లేశీ పక్కచెంగెగిరీ
మాలుమీాదగూర్చున్నా రాజుచూ
సేడూ
చాకీతజవనంబూ ఎంతచక్కన్నా
జవనమెంచగరాజాజాతితెక్కువగా
కూర్చోవేచాకీతాకూర్చోవేరంభా
కూర్చుంటే కుర్చీల పీటేదిరాజా
నీవు నాఐశ్వర్య లక్ష్మివై తేనూ
ఇప్పుడే తెచ్చెదనే కూర్చీలపీటా
నిలబడవేచాకీతా నిలబడవే రంభా
నిలబడితే నిమ్మల్లా నీడేదిరాజా
నీవు నా ఐశ్వర్యలక్ష్మివై తేనూ
ఇప్పుడేయిస్తునే నిమ్మల్ల నీడా
వొంగోవేచాకీతా వొంగోవేరంభా
వొంగుంటె వంగిల్ల నీడేదిరాజా
నీవు నా ఐశ్వర్యలక్ష్మివై తేనూ
ఇప్పుడేయిస్తునే వంగిల్లనీడా
చాకీత నీయిల్లు ఎంతదూరంబే
పడమటనువున్నాదీపచ్చకొర్రనేతా
చాకీత నీయిల్లు ఎంతదూరంబే
తూరుపునవున్నాదీతుమ్మపువ్వునేతా

చాకీత నీయిల్లు ఎంతచక్కన్నే
చుట్టుబారీగోడా సున్నంపుగచ్చూ
చాకీత నీరేవు ఎంతదూరంబే
నట్టేడుసంద్రాలా నడుమనూ రేవూ
చాకీత నీరేవు ఎంతచక్కన్నే
చుక్కలుది పిడిచేదీ గవ్వలిదిగూనా
నీళ్లుపిడిచినవద్దా నిమ్మలాతోటా
చౌడుపిడిచినతోటా అదిచంబతో
టా
గంజిపిడిచినవద్దా గింజయ్యతోటా
చాకీత నీరాజు ఎంతచక్కన్నే
ఎఱ్ఱబట్టలువుదుకా వెన్నుడోయి
రాజా
పొత్తిబట్టలు వుదుకా పొందుడో
యి రాజా
నీలిబట్టలువుదుకా నినుగోలురాజా
చాకీతనీరాజు అంతచక్కన్నా
ఆప్రొద్దు బోనిచ్చీ ఆమరునాడూ
ఎవరియింటికివారూ వెళ్లిపొయ్యేరూ
నిశారాత్రీవేళా నిద్దురాప్రొద్దూ
కలియగంధారంబూ కానరానేళా
గడపమీదకాల్లేసీగడియతాబూనే
ఎవరయ్యనాతలుపుగోళ్లుమీటేరూ
నేనె ఓ చాకీతా కూటికొచ్చేనూ
కూడేళదప్పిందీ కూడెట్లావచ్చే.
ఆప్రొద్దుబోనిచ్చీ ఆమరూనాడూ
నిశారాత్రివేళా నిద్దురాప్రొద్దూ
గడపమీదకాల్లేశీగడియతాబూనే
ఎవరయ్యనాతలుపుగోళ్లుమీటేరూ
నేనెఓ చాకీతా పాలకొచ్చేనూ
పాలేళదప్పిందీ పాలెట్లావచ్చే.
ఆప్రొద్దు బోనిచ్చీ ఆమరూనాడూ
గడపమీదకాల్లేశి గడియూడతీసీ
యింటిలోచోటియ్యే చాకీత రంభా
యింటిలోపలకఱ్ఱీ పిల్లులున్నాయీ
ప్రక్కనీ చోటెట్టే చాకీత రంభా
ప్రక్కనీబంగారూబాలుడున్నాడూ
వెనువైపు చోటియ్యే చాకీతరంభా
వెనువైపునావెండీ రాజువున్నాడూ
అక్కడకు ఆరోజు తెలవారిపోయే.

—సశేషము.

బహాదూర్

[ఆంధ్రమండలాన్ని నైజాము రాజ్యములో కలుపుకోవాలని చూస్తూవున్న యార్జంగు బహాద్దూరును గురించి వ్రాయబడ్డవి.]

అటు జిన్నా భరతావనిన్ కటికవంధ్యాబుద్ధి ఛేదించు కా
పటవృత్తిన్ దలపెట్ట నీకెతగు వహ్వా జంగు శాహాదురూ!
ఇట ఆంధ్రావని మూటగట్టుకొని నీయిస్లాము పాదంబు సం
దిట ద్రోచ్చే సుఖ స్వప్నహర్మ్యమ్మును సిద్ధింపన్ విపర్యాయమున్.

"గుడ్డిలో మెల్ల" ఇచ్చటని కొంచెము ఊపిరిదీయుచుండి, ఈ
గడ్డపు సాహెబు ల్నడుపు కిర్కశరాజ్యనిరంకుశంబు పా
ల్పడ్డ యధోగతిన్ మనము బాపుకొనంగ నశక్యమెమ్మొయిన్
అడ్డుకొనంగ జూతుము బహద్దరుజంగు కుతంత్ర మిప్పుడే.

* 'బూరె' యనన్ 'అబుక్క' నెడి బుద్ధికి దోచదుగాని; ఓ బహ
ద్దూరుడు వారు మేము సమదుఃఖముకున్ గుఱియైనచో, బల
ప్రేరిత ధైర్యమున్ మొదటి పెట్టుకె చెచ్చెరవచ్చి మిమ్ములన్
జోరున శాధ్యతాయుత ప్రభుత్వపు వెల్లున ఊడ్చివేయుదా?

మమ్ముల లొంగదీసి పరిమార్పగ 'నాఫ్రిది' వారి నేరి సై
న్యమ్మున జేర్చుకోదలచు న్యాయము; వారికి కూడు జీరకున్
చెమ్మటలూడ్చి రైతు లరిజెల్లగ జేసిన జీతమిచ్చు న్యా
యమ్మును, కేంద్రరాజ్య మసహాయతనున్న స్వతంత్రతౌర్క్య రా
జ్యమ్మును దక్షిణాపథము నంతను నేలు ఉపాయ మెట్టి వా
జమ్మయు కాని గుర్తిడగ జాలును, చూతిము వీరియాటలున్.

'ముల్కీ' యన్నని బంధనంబకట సమ్మోహాస్త్రమేగాక, గైర్
ముల్కీల్గారె పఠానుసైనికులు మర్మోద్యోగులా మంత్రులున్?
బలాత్కపట్యముచేత హైందవుల డబ్బంతన్ నియోగించ, క
ట్టలక్కన్ భారతదేశమంతయును ఈడాంబీకమున్ జూడదే?

* "'బూరె' అంటె 'అబుక్క' అంటాడు" అని మావైపుసామెత అనగా ఏదైనా కొస్త ఆశచూపించేసరికి, అదికావాలని మిక్కిలి పట్టుపట్టి అది ఎంత దుస్సాధ్యమైనా కాంక్షించేబుద్ధి.]

—బలాదూర్

ఊరేగింపు

[౧౮౧-వ పేజీ తరువాయి.]

పిల్లలంతా ఒక్క ఈడువాళ్ళు నాని ఇంటిదగ్గర రోడ్డుమీద నిలబడ్డారు. బడి విడిచిపెట్టే వేళయింది. బడిపిల్లలు పరుగెత్తుకొస్తున్నారు. నాని ముందు వాడి వెనుకాల ఇతర పిల్లలూ వరుసగా నిలబడ్డారు. నానిచేతులో పొడుగాటి వెదురుబద్ద ఉంది. జేబులోంచి మూడురంగుల జండాతీసి ఆబద్దకి తగిలించాడు. అతని వెనుకాల సుబ్బులు నిలబడింది. సన్నగా గొంతుకెత్తి 'ఖండాంతములా క్యాతి గాంచీ జయముగూర్చే జండా' అని పాడింది. అంతా అందుకున్నారు వచ్చీరాని మాటలతో. ఎంతసేపుపాడినా అదొక్కటేచరణం. 'గాంధికిజే' అన్నాడు నాని. అంతా జేఅన్నారు. ఊరేగింపు సాగింది. బీటు కనిష్టేబులు పరుగెత్తుకెళ్ళి అధికారులతో చెప్పేడు. సైకిళ్ళమీద 4 గురు పోలీసులూ, ఇన్స్పెక్టరూ చక్కా వచ్చారు.]

ఇనిస్పెక్టరు— ఓరి మీ తస్సాదియ్యా, ఇదేమిటగ్రోయ్ : ఆగండి వేలెడున్నారో లేదో మీకిదేంపనిరా? ఇళ్ళకుపొండి.

నాని— మేము పోం.

ఇ— ఆఁయి. పోరూ? వీధులో జండాపుచ్చుకుని తిరుగకూడదు తెలుసునా ?

నా— ఏం తిరిగితే ?

ఇ— ఏమా ? బెత్తాల్తో వీపు బద్దలకొడతారు.

నా— ఎవరయ్యా మమ్మల్ని కొట్టేది ?

ఇ— ఇదుగో పోలీసులు. వీళ్లే.

నా— పోలీసులు వీళ్ళేనా? మానాన్ననీ, వాళ్ళనీ కొట్టిందివీళ్ళే?

ఇ— మీనాన్నెవరురా ?

నా— మానాన్నెవడా? మానాన్నే. అదిగో మాఇల్లు.

ఇ— ఓహో సరి నువ్వా? ఎక్కడికర్రా బయల్దేరేరు ?

నా— ఊరేగడానికి.

ఇ— ఏమిటా ఊరేగింపు ?

నా— జండా ఊరేగింపు.

ఇ— ఓరేయి కుంకల్లారా, తప్పురా? జండా ఇల్లాఇచ్చి చక్కాపొండి. లేకపోతే జాగ్రత్త !

నా— అబ్బో! ఆ పప్పుడకదు. జండా ఇస్తానా ? ఇవ్వను. జండా పట్టుకుంటే ఏంతప్పయ్యా ? జండా అంటే మీకెందుకంత భయం ?

ఇ— ఓహో ! చాలా ముదిరింది. తప్పంటే తప్పే. ఒరేయి, మీకు జండా కావలిస్తే ఇదిగోరా ఈజండాపుచ్చుకుని ఊరేగండి.

[ఇనస్పెక్టరు యూనియనుజాకు చూపిస్తాడు.]

మోహనుడు— అబ్బే, ఈజండా మాకక్కరలేదు. దానిమీద రాటంఏదీ? అది బాగాలేదు. మాకొద్దు.

ఇ— ఒరేయి, మీరు నెమ్మదిగా చెపితే వినేటట్లులేరే. చాలా అధికప్రసంగం చేస్తున్నారే. తప్పంటే వినర్రా ?

రా— ఎవరుచెప్పేరు తప్పని ? తప్పైతే మాబాబయ్యా, వాళ్లు ఎందుకు చేశారు.

ఇ— ఒరేయి. ఇక నోరుమూసుకుని పొండి. లేకపోతే చూశారా పోలీసుల బెత్తాలు !

అందరూ— ఆ. చూశాం. మాకేమైనా భయమా ?

ఇ— భయంలేదట్రా ? చెపితే వినరూ? బెత్తాలు తీయమంటారా? ఏయి, 534, 643 బెత్తాలు తియండ్రా.

నాని— ఒరేయి రాముడూ, సుబ్బులూ, సై. జండాపాటపాడండి. 'ఖండాంతముల క్యాతిగాంచీ...

ఇ— ఏయ్. ఛార్జ్.

(పోలీసులు గబగబా బెత్తాలతో వడ్డించారు. నాని 'గాంధీకీజే' అన్నాడు. అంతా జేఅన్నారు. ఇనస్పెక్టరు జండా లాక్కోపోయాడు. నాని గట్టిగా పెనగులాడేడు. చివరకి జండా లాక్కున్నారు పోలీసులు. నిస్పృహచెందేరు పిల్లలు. ఆవేశం పొంగివచ్చింది నానికి. కాని చేతిలో జండాపోయింది- అల్లాగే తెల్లబోయి నిలబడ్డాడు- పోలీసు లందరినీ గబగబా ఇళ్ళకి లాక్కెళ్లేరు-)

అహింసాసాధన

దౌర్జన్య మెక్కువైనప్పుడు ఆత్మరక్షణకూడా చేసుకొనకూడదా అను ప్రశ్నకు మహాత్ముడు మందహాసంచేస్తూ 'అహింసాసిద్ధాంతమునందు పూర్ణవిశ్వాసంగలవారికి ఈవిషయమై సందేహముండడానికి సావకాశమేలేదు' అని మధురభాషణములతో సెలవిచ్చియున్నాడు.

రచయిత:

ఊటుకూరు సత్యనారాయణరావు

కంటికికనబడే చరాచరమైన సృష్టి అంతా మొదలు చేసుకుని అవ్యక్తరూపంతో వున్న జీవరాసుల వరకు అన్నీ భూతాలే. అన్నిట్లోకి పెద్ద భూతాలు అయిదున్నాయి వాటికే పృథ్వి ఆపస్తేజోవాయు రాకాశాలు అంటారు. ఇవి భూతాలసృష్టికి, స్థితికి, లయానికి కారణమౌతున్నాయి. వీటి సంయోగం చేత కలిగిన ఈసృష్టితో మన కెంత సంబంధమున్నది ప్రస్తుతాంశం.

మానవధర్మాల్లో ప్రధానమైనవి దయ, సత్య, శౌచాలు. అంటే మొదటిది ధర్మం దయ అని తేల్తున్నది. సత్యానికన్నా దీనికి ప్రధానస్థానముందో, లేక సత్యాన్వేషణకు ఇది సాధనమో ఊహించాలి నేటి నవయుగానికి ప్రవక్తయున్న, మానవశ్రేష్ఠుడున్న, అహింసా స్వరూపాన్ని సత్యజీవితంలో ప్రదర్శిస్తూన్న అపర బుద్ధావతారంగ అంగీకరించదగిన మహాత్ముడు దయనుగురించి తన ఆశ్రమవాసులకిట్లా వివరించారు. 'సత్యము, అహింస ఈరెండు అవినాభావ సంబంధములు. ఒకనాణానికి రెండుముఖాలు ఏరీతిగా వున్నాయో, సత్యము అహింస అన్యోన్యాశ్రయములు కాబట్టి సత్యమను పరమావధిచేరటానికి అహింస సాధనమార్గం.' దయను సాధనంగా పెట్టుకుని ఎందరో, తమసత్యపథాన్ని చేరటానికి సర్వార్పణంచేసినట్టు మన పౌరాణికయుగంనుంచి నేటివరకు ఆర్య సాంప్రదాయాల్లోను, మతాంతరాల్లోను అనేకనిదర్శనాలున్నై. ఈసాధనమార్గంలో జీసెస్సు సిలువనెక్కాడు. సిద్ధార్థుడు భిక్షువైనాడు. ఇది వ్యక్తి ఆముష్మిక జీవితానికే గాకుండా, జగత్తునకంతకు శాంతిసాధనం. జగచ్ఛాంతికి ప్రేరేపించే ముఖ్యసాధనం గనుక నే మహాపురుషులు ఆత్మధర్మంగా దీని నంగీకరించారు. అవ్యక్తమైనసత్య స్వరూపాన్ని వ్యక్తంచేసుకున్నారు దీన్ని జనసామాన్యంలో ఆచరణ యోగ్యంగా చేయటానికి మన పూర్వులు కొన్ని కర్మలను నియుక్తం చేశారు

ఇహలోకంలో హవిర్యాగాలను, ఆముష్మికతరణోపాయంగ పితృశ్రాద్ధాది సప్తపాకయజ్ఞాలను, ఆగ్న్యాధేయాది సప్తహవిర్యజ్ఞాలను, అగ్నిష్టోమాది సప్త సోమయజ్ఞాలను విధించారు ఈ యజ్ఞాలు మానవుడికి క్రమశిక్ష నేర్పి అంతఃకరణశుద్ధికి తోడ్పడుత వని వారివూహ. ఈక్రతువుల్లో కొన్నికొన్ని హింసాత్మకమయినవి కూడా ఉన్నాయి. భూతదయాళువులైన వారికి ఇవి అర్థమే కావటంలేదు. శ్రుతిస్మృతులు మాత్రం సత్యాహింసలే శ్రేష్ఠమైనవని ఘోషిస్తున్నయి. ఐహికాముష్మికాల కుపయోగిస్తవని కర్మశాసకులు విధించినా, మోక్షసాధనకవి బంధహేతువులని తేల్తున్నది. అందుకే ఫలరహితమైన కర్మచేయమని శ్రీకృష్ణభగవానులు బోధించి నాటి ద్వాపరానికి ఉపదేష్టఅయినారు. అదే నేను కేవల హిందూధర్మమే

కాకుండా, విశ్వమానవ శిరోధార్యమగు పరమధర్మంగా వెలుగుతూంది. ఆదయయొక్క నిజస్వరూపం క్షమాపణమాత్రంగాదు. దయఅంటె క్రమమైన శిక్ష. దయలో బుద్ధియొక్క సమత్వమున్నది దయలో మతమతాంతర భేద విచ్ఛేదముంది. దయలో చీమ, బ్రహ్మ అనే సృష్టిపరంపర కెంత సన్నిహితత్వముందో దాని అపురూప ప్రదర్శనం ఉంది దయలో ఆకాశం వంటి నైర్మల్యం, సముద్రమువంటి గాంభీర్యం, వాయువువంటి సర్వవ్యాపకత్వం, పృథ్వివంటి సర్వభారవహత్వం, అగ్నివంటి అనంత జ్యోత్స్నవికసనం ఉంది. దయయే పరమధర్మం.

తోడి మానవులను రాక్షసవృత్తితో చూసేవారిక్కూడా ఈ దయాభావం సిద్ధిస్తుందని చెప్తారు. రాక్షసభావంతో చూసేవాడు తన రాక్షసత్వానికి ప్రతీకారం పొందితీరాడు. ఆప్రతీకారబాధానుభవంలో నరాలు ఉడికిపోయి, పరిస్థితులు తారుమారై, చిత్తసంస్కారాన్ని పొందతున్నాడు. చిత్తసంస్కారమే దయకు బీజంగా ఏర్పడుతూంది. దేహాభిమానం, అహంకారం క్రమంగా నశిస్తున్నకొద్ది ఆదయ సంఘంలోను, మతంలోను, మతాంతరముల్లోను, మానవసంఘంలోను, స్థావరంలోను, జంగమంలోను, విద్యుద్వాహినివలె అఖండధారావాహకంగా కదుల్తూన్న సత్యంతో తనకున్న అనన్య సంబంధం గుర్తించ గలుగుతూంది. ఈశ్వరుని అంతర్యామిత్వం నాడే మానవహృదయం చూడగలుగుతుంది సృష్టినంతా దేహాభిమానంతో వినియోగించుకొంటూన్న ప్రవృత్తి నశించి, తానే ఆత్మార్పణం చేయాలని సంకల్పిస్తున్నాడు అప్పుడు. ఇదియే దయయొక్క పూర్ణ స్వరూపం— ఇదియే జీవుని చరమదశ—ఇదియే మానవుని పరమ ధర్మం.

శ్లో॥ సర్వయజ్ఞేషు వాదానా
సర్వతీర్థేషు చాప్లుత్న
సర్వదానఫల్నచాపి
నైతత్తుల్యమహింసయా
(అనుశాసనపర్వం-భారతం)

సమస్త భూతాలు తనకు భిన్నమనేభావం నశింపచేసుకొనుటే ఈ అహింసాయజ్ఞానికి సూత్రప్రాయంగా ఉంది.

దయను అలవరుచుకోటానికెన్నో అంతరాయాలు వస్తాయి. అంతరాయాలను ఎదుర్కోటానికి ఇంద్రియనిగ్రహం, సహనం కావాలె. ముఖ్యంగా దౌర్జన్యంతో పోరాడవలసివుంది. దౌర్జన్యం విశృంఖలవేగంతో, భౌతికబలసంపత్తితో, హుంకరిస్తే ఏమౌతాడు సాధకుడు—? సాధకుడు గండ్రతేల్లాగు ముందుకు వస్తాడు. తనను ఫిరంగే వరిస్తున్నదో—పిడుగే వరిస్తున్నదో వానికవసరంలేదు. స్వజనుడో— పరజనుడో. రాజో— కింకరుడో.

మన ప్రహ్లాదకుమారు డేమిచేశాడు. కొండపైనుండి దొర్లించబోతే కోలాహలంచేశాడు కంటకమార్గాలపైన నృత్యంచేశాడు విషపాత్రిక తెస్తూన్నవాడినిచూసి ఈశ్వరపాద సరోజమకరందభ్రాంతితో చేరబోయి, లాగికొని. పరమానందంతో పాడుకొంటూ త్రాగివేశాడు.

మహానుభావుడు క్రీస్తు తనను సిలువపై మేకులు కొట్టువారు అంత్యప్రార్థనచేసుకొమంటె ఓ తండ్రీ! వీరిని క్షమించు. ఏలనగా వీరేమిచేస్తున్నారో వీరికి తెలియటంలేదు అన్నాడు.

ఎంతగుండెలు కదలించివేస్తున్నదీ ప్రార్థన. యుగయుగాలనాటి ఆప్రార్థన, కాలకర్మాల భయంకరవ్యాఘాతాలను చీల్చుకుని మతాంతర భేదాన్ని విచ్ఛేదం చేస్తూ, ఎక్కడో అగాధంగావున్న హృదయకుహరాల యోగనిద్రాభద్రమైన దయాశక్తిని రేపెట్టతూంది. మిథ్యాభిమానం చూర్ణం చేసివేస్తున్నది. ఇవన్నీ భూతదయాళువుల జీవితాల్లోని చివర ఘట్టాలు. ప్రారంభకుడేమిచేయాలె దౌర్జన్యం దౌర్జన్యంవల్ల మాత్రం నశించదు. దౌర్జన్యానికి తనకువున్న సంబంధాన్ని తెంచుకోవాలె తనలో అంతర్లీనమైవున్న దయయొక్క సంపూర్ణ వికాసాని

అడ్డుకునే భావపరంపర అంతా ఐహికమైవుంటుంది. ఈ ఐహికమంతా నిమిత్తప్రాయమైందని, ఆత్మవికాసాని కది పరీక్షారంగముగా ఈశ్వరుడు సృష్టించాడని, తెలుస్తున్నది. ఐహికవికారాలను తృణీకారభావంతో వీక్షించడానికి తగిన స్థయిర్యం ఎంత అలవరుచుకొంటాడో సాధకు డంత శీఘ్రంగా తన గమ్యస్థానం చేరుకొంటాడు.

అహింసా సాధన పరంపర సత్య సౌధారోహణానికి సోపానశ్రేణిక. సత్యానికి జయం నిశ్చయమనే విశ్వాసం బలపడినవారు అనుష్టానంలో భీరులై వెనుకంజవేయరు. వారి కీశ్వరాశీర్వాదం చేయబడింది. ఈ యాశీస్సున కెత్తిన చేయి సృష్ట్యాదినుంచీయు ఆత డట్టే పట్టియుంచినాడు. ఆ చేయి కనుపడకండా ఎన్నియో ప్రళయాబ్దాలు బారులుతీరి ఘూర్ణిస్తున్నాయి. పాదాలక్రింద భూమికుదుపు వేస్తూంది.

దౌర్జన్యమెక్కువైనప్పుడు ఆత్మరక్షణ కూడా చేసుకొనగూడదా? అను ప్రశ్నకు మహాత్ముడు మందహాసంచేస్తూ 'అహింసాసిద్ధాంతమునందు పూర్ణవిశ్వాసంగలవారికి ఈవిషయమై ఎట్టి సందేహాలుండవు. ప్రతిపక్షులు దౌర్జన్యం చేసేటప్పుడు, ఆత్మరక్షణకై ఎట్టి ప్రయత్నాలు చేయకుండుటే ఉత్తమమైన ఆత్మరక్షణ విధానమని' శలవిచ్చియున్నారు.

తన నిస్సహాయస్థితి పూర్ణంగా గ్రహించగానే, 'కలడందురు దీనులయెడ' నేడు నాదీనావస్థకేల ఉపేక్షచేస్తున్నాడని గజేంద్రు డాక్రందనజేసేసరికి సిరికింజెప్పక, శంఖుచక్రయుగముం జేదోయి సంధింపక, ఆకర్ణికాంతర ధమ్మిల్లము చక్కనొత్తకయే వచ్చి రక్షించాడు.

అహింసాసాధకుడి జీవితము ఎంత భయంకర జీమూతవేళా భైరవతాండవమునకు స్థానమో, ఫలితమంత వినిర్మలశారద చంద్రికాచ్ఛాదనమువంటిది. ఆచంద్రికాచ్ఛాదనపు మహానందస్వైరభూములలో విహరించటాని కెంత అదృష్టము, ఎంతసంస్కారము కావాలె?

సామాన్యమైనజ్ఞానం జీవితపు సమగ్రత్వాన్ని కల్పించలేదు. 'బహూనాం జన్మనామంతే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే' ఎన్నిజన్మాలకీ సర్వభూతదయాళుత్వ మాత్మపరివేదనారూపంతో వెలుగులు చిమ్ముతూ దిశాచ్ఛాదనం చేస్తుందో నాడుగదా తెలియుట! భక్తులు దానిని పరమసులభమని చెప్తారు. అనుభూతసులభములే కాని ఈతత్వం తర్కసులభం కాదు.

లక్ష్మణామూలిక

ఈ మూలికను ఒక్కసారి సేవిస్తే స్త్రీల గొడ్డురాలితనము పోయితీరుతుంది.

ఈమూలికకు
పాల తెల్లని పువ్వులు
నూగునూగుగావుండే తీగెలు
ఎర్రని చుక్కలుగల ఆకులు
వుంటాయి.

ఈ యోషధిని 'లక్ష్మణపంజి' యని ఆంధ్రప్రాంతముల యందును, 'లక్ష్మణ' యను పేరుతో మలయాల ప్రాంతముల యందును వాడుక చేయుచున్నారు. కాని ప్రశస్తతంత్రకారులగు అగ్నివేశ సుశ్రుతాదులు దీనిని వాడినట్లు కానరాదు. ఉత్తరదేశస్థులుకూడా యిద్దానిని తగినంత విమర్శనచేసినట్లు కన్పట్టదు. ఆంధ్రమునగల 'ధన్వంతరి' నిఘంటువుగాని సంస్కృతలిపిబద్ధమగు 'మదనపాల' నిఘంటువుగాని దీనిని చూచినట్లులేదు. అన్నిటితోపాటు వివిధఓషధులను గుదిగూర్చిన అమరసింహుడు సైతము లక్ష్మణమాట మరచిపోయినాడు.

లక్ష్మణపంజి

ఇకపోతే యీ లక్ష్మణ వాడుకలోకి యెట్లావొచ్చిందనేదొక ప్రశ్న. ఔత్తరాహులలో ప్రశస్త చికిత్సకుడగు భావమిశ్రుడు పర్యాయపదగుణసహితముగా నీయోషధిని వ్రాసినాడు. తెనుగున ప్రసిద్ధచికిత్సాసిద్ధుడగు బసవరాజు వంధ్యాప్రకరణమున దీనిగుణము, ప్రయోగముమాత్రము వ్రాసినాడు. ఇంతేకాక సర్వంకషప్రజ్ఞాన్వితుడగు 'యోగరత్నాకర' కారుడు వంధ్యాప్రకరణమున లక్ష్మణాప్రయోగము విశిష్టముగా వ్రాసినాడు. ఇంతకుమించి రమారమి ఆయుర్వేదప్రపంచమున ఈయోషధియొక్క ప్రచురణ మంతగా గానరాదు. భావమిశ్రుడు వివరణములో యీయోషధి చాలాతక్కువగా దొరకుననియు, విశేషముగా పర్వతములయందు మాత్రమే మొలుచుననియు, ఆకులు వెడల్పుగానుండి ఆకుపైన రక్తచందనమువంటి రంగుగల చుక్కలుండుననియు. దీనికి ఆడుగున తెల్లనిదుంప వుండుననియు వ్రాసినాడు.

భావమిశ్రుడు

భావమిశ్రుడుచెప్పిన లక్షణములు, గుణములును ఇట్లుకలవు.

శ్లో॥ పుత్రకాకారరక్తాల్ప
బిన్దుభిర్లాంఛితాసదా
లక్ష్మణా పుత్రజననీ
బస్తగంధాకృతిర్భవేత్
కథితా పుత్రదాऽవశ్యం
లక్ష్మణాముని పుంగవైః.
—భా-పూ-గుడూచ్యాది

పుత్రకాకృతిగా యెఱ్ఱనిచుక్కలతో కూడిన ఆకులుకలిగి 'బస్తగంధాకృతి' దుష్టపుచెట్టు ఆకారముగా వుంటుందనియూ, అవశ్యము పుత్రోత్పత్తిని చేయునని మహర్షులు చెప్పినారనియు దీనితాత్పర్యము.

బసవరాజు

ఇట్లే బసవరాజును చాలా సంగ్రహముగా వ్రాసినాడు.

శ్లో॥ లక్ష్మణాంగోపయోయుక్తాం
నస్యేపానే ప్రయోజయేత్
సా స్త్రీప్రసూయతేపుత్రం
లక్షణాఢ్యం సుపండితం.
—బసవరాజీయం. వన్ధ్యా.

ఏ స్త్రీగాని లక్ష్మణామూలమును ఆవుపాలతో నస్యముగాగాని, లోపలికిగాని తీసుకొన్నట్లయిన నిశ్చయంగా పండితుడగునట్టి పుత్రుని కనునని భావము.

యోగరత్నాకరకర్త

యోగరత్నాకరకారుడింకను కొన్ని విశేష సూచనలిచ్చినాడు.

శ్లో॥ పుష్యోద్ధృతంలక్ష్మణాయా
మూలం దుగ్ధేనకన్యయా

పిష్టంపీత్వాబుతుస్నాతా
గర్భందత్తేనసంశయః॥

పుష్యమీ నక్షత్రమందు లక్ష్మణా మూలమును తెచ్చి ఆవుపాలతో కన్యకచే నూరించి ఆ కల్కమును ఋతుస్నాతయగు యువతి త్రాగినయెడల తప్పక గర్భము దాల్చును.

శ్లో॥ లక్ష్మణాక్షీరసంయుక్తా
నస్యేపానేప్రశాప్యతాం
తేనసాఽపి లభేద్గర్భం
పుత్రోవిద్యాధరోభవేత్
వామనాడ్యా భవేత్కన్యా
పుత్రోదక్షిణ యాభవేత్॥ ౨

లక్ష్మణామూలమును ఆవు పాలతో నూరి నస్యముగాను, లోపలికి తాగుటకుగాను ఉపయోగించిన అట్టి స్త్రీ గర్భముధరించుటయే గాక ఆమె ప్రసవించిన పుత్రుడు విద్యాధరరూపుడగును. ఎడముముక్కున నస్యము చేసిన కన్యయు, కుడిముక్కునందు నస్యముచేసిన పురుషుడును కలుగుదురు.

శ్లో॥ లంకాకారం లక్ష్మణాయాశ్చమూలం
కంఠేబద్ధంసర్పిషానస్యయోగాత్
పీత్వానూతేపుత్ర మత్యన్తవీర్యం
పశ్చాదన్యానప్య మన్దాజ్ఞయుష్టిః॥ ౩

లంకాకృతిగనుండు లక్ష్మణా మూలమును స్త్రీ మెడన కట్టి-లక్ష్మణా మూలమును నేతితో (ఆవు నేతితో) నస్యము చేసినయెడల ఆమె అధిక బలశాలియగు పుత్రుని కనును. ఇట్లొక్కసారియే గాక పిమ్మట కలుగు పుత్రులుకూడ బలిష్టులుగానే వుందురు.

తెల్లములక

ఇట్లు సమర్థులగు చికిత్సకులు దీని వాడుకలను వ్రాసినారు. యీ యోషధి సర్వసాధారణముగా దొరకనియెడల ఇంత స్వతంత్రంగా నమ్మకముతో చికిత్సాతంత్రములందు వ్రాయుట అసంభవము. అట్లయిన నీ యోషధి దొరుకుచున్నదా యనుట నాలోచింపవలసిన విషయము. ధన్వంతరి నిఘంటుకారుడు తెల్లములకకుకూడా 'లక్ష్మణ' యనుపర్యాయపదము వ్రాసినాడు. కాని అదియే యీ లక్ష్మణయనుటకు వీలు లేదు. పై లక్షణములనుబట్టి ఓషధులను నామరూపములతో యిట్లాగని నిర్దుష్టముగా చెప్పగల గ్రంథములు కానరావు. ప్రాచీన తంత్రకర్తలుకూడా యే కొద్ది సంఖ్యగల ఓషధులకో ఆకృతులను తెలియచేసినారు కాని ప్రతి ఓషధియొక్కయు వివర్శన వ్రాయలేదు: లేక అట్టి సంపూర్ణ విమర్శనాయుతమగు గ్రంథ సామగ్రి కలిగియు, తక్కిన విజ్ఞాన మంతరించినట్లే ఇదియు అంతరించి యుండవలయును.

ఆంధ్రప్రాంతంలో

ఈ యోషధిని ప్రత్యేకముగా ఆంధ్రప్రాంతీయ చికిత్సకులు వాడి ఫలసిద్ధినొందినట్లు వాడుక. ఇందుకొఱకై వివిధ ప్రయత్నములు సలిపి యీ యోషధిని గుర్తింపకలిగితిమి. యీ యోషధి నైజాంప్రాంతములందును, పశ్చిమ గోదావరిజిల్లా ఏలూరు శనివారప్పేట ప్రాంతములలోను, గుంటూరుజిల్లా వంగోలు తాలూకా యీతముక్కల మన్నూరు గ్రామములందును విరివిగా దొరుకుచున్నది. ఇతర ప్రాంతములవారు దీనినే గొల్లిజిడ్డని వాడుతారట గాని గొల్లి జిడ్డని వాడుకగల తీగె వేరురూపంగా వున్నది. వంగోలు తాలూకాయందు మాత్రము దీనిని 'సంజాకు' అని వాడుతారు. గాయములకు, మానని పుండ్లకు ఆకు నూరి కట్టుకడతారు. ఇది నేనుకూడా స్వయముగా చూచినాను. గాయములు, పుండ్లు త్వరగా మానిపోతవి. చీముపట్టవు. శ్రీమాన్ వేదాంతం కేశవాచార్యులుగారు (ఏలూరు వద్ద శనివారప్పేటలో వుంటారు) మాటల సందర్భమున తమ పితామహులగు వేదాంతం వేంకటాచార్యులవారు వంధ్యాదోషములకు వాడుచు తమకీ యోషధిని చూపించినారని నాకీ లక్ష్మణపంజిని చూపించినారు. వంగోలు ప్రాంతముల వారు వొకరిద్దరు ముసలమ్మలు ఈ యోషధినిగూర్చిన ప్రశంస చెప్పుచుండెడివారని విన్నాను. ఆయుర్వేదవైద్యవరులు దీనిని వాడి చూచి సరియగు గుణమును వెల్లడింప గోరెదను. భావమిశ్రుడు చెప్పినట్లు ఈ లతకు దుంపలేదు. వేళ్లు మాత్ర మేకలవు. ఒకవేళ యిది లక్ష్మణ కాదేమో యను కొనుటకు వీలు లేకుండా యిందుకుగల ప్రమాణమును, ఆధారమును ఇందు పొందుపరచుచున్నాను.

లక్ష్మణలక్షణము

శ్లో॥ గోక్షీరసదృశంపుష్పం
రోమవల్లీసమన్వితం
రక్తబిన్దుయుతంపత్రం
లక్ష్మణాకారముచ్యతే॥

ఆవుపాలవలె స్వచ్ఛముగా తెల్లగా పుష్పములును, నూగునూగు గల తీగెయు, యెఱ్ఱని చుక్కలచే ఆవరింపబడ్డ ఆకులునుగల తీగె లక్ష్మణయని దీని యాకారము వర్ణింపబడినది. నేను చూచిన లతయు ఇట్లే గలదు. ఇట్టి శ్లోకములు కొన్నిగల తాళీదళ సంపుటము ప్రాచీనమైనది. శ్రీమాన్ శాపురం శేషాచార్యులవారివద్ద నున్నది. (నైజాం పాలమూరు జిల్లాలో యీ పూరు పాలమూ

రకు ఆయిదారు కోసుల దూరములో నున్నది.) ఇంతేగాక వారు స్వయముగా రెండుమూడు పర్యాయములు వంధ్యాస్త్రీలకిచ్చి గుణము ఫలవంతముగా అనుభవమున చూచినామని చెప్పినారు. దీనినివారు వాడినవిధానమును తెలియచేసినారు. దానినికూడా వ్రాయుచున్నాను.

వాడు విధానము

ఋతుస్నాతయగు స్త్రీకి స్నానానంతరము వెంటనే- గదినుండి యివతలికి రాకుండా (అనగా గడపదాటకూడదు) యీలతయొక్క వేరును సుమారు ఒక తులమెత్తు పదితులాల ఆవుపాలతో నూరి కల్కముచేసి తాగించవలయును. ఒక పర్యాయము తాగించిన చాలును. ఎవరికి కూడా రెండుపర్యాయములు తాగించలేదని శ్రీశేషాచార్యులవారు చెప్పినారు. ఇట్లు తాగించిన రోజున ఆవుపాలు అన్నముమాత్రమే పథ్యముగా వుండాలి. అదే నెలయందు గర్భమునిలుచును. లేదేని రెండవమాసమున తప్పదు. మొత్తము మీద మూడుమాసముల లోపుగా గర్భధారణ కలుగుతుంది.

పరిశోధన

ఈయోషధి వర్షాకాల ప్రారంభము నుండి చలికాలము అంతమువరకు మాత్రమే దొరుకుతుంది. యీరోజులలోనె దీనిని వుపయోగించాలి. 'శరద్యఖిలకార్యార్థం' అన్నట్లు శరద్హేమంతములలోనే దీనిని వాడుట చాలామంచిది చికిత్సకులు వాడిచూచి తమ అనుభవమును ఈ పత్రికాముఖమున వెల్లడింపవలయును. దీనినిగురించిన విశేషము లేమైన నున్న యెడల తెలియచేయవలయును.

—(ఆయుర్వేదకళ.)

ఆ పిల్లడు ఎవరూ ?

మధురానికి 'మళ్ళీ పెళ్ళి' ఆనందంతో!
కొడుకుసంగతి కానకపోయాడు—
రంకుతనమని అపోహ పడ్డాడు.
ఆఖరికి యింటికొంచి పొమ్మన్నాడు—

కథకుడు :

బందుచోడే లక్ష్మణరావు

'—మధురం! మీయింటికి వెళ్లు, మీ ఆనందం వచ్చేవేళ అయింది.'

.. ..

*   *   *

'మధూ! ఆపిల్లడు ఎవరూ?' - అంటూ లోపలికివచ్చాడు- ఆనందం.

'అబ్బే-వాళ్ళబ్బాయి లెండి' అంది మధు, సంతోషంగా చూస్తూ!

'నీకూ్కడా, ...'

'నా ఖర్మం'

'ఎలా, ఏడుస్తున్నాడో ? పాపం !' అని కుర్చీలో కూర్చున్నాడు ఆనందం.

'అమ్మకోసం...'

'యిచ్చిరా, వెళ్లు'

*   *   *

'గంటసేపయిందే ? - ఏంచేస్తుంది. యింకా అక్కడ ?—' అనుకున్నాడు ఆనందం.

*   *   *

'మధురం! అర్ధరాత్రివేళ తీసుకొని వచ్చావేం?'

గడియారం ఎనిమిది కొట్టింది, టైం ఎక్కువ కానట్టు.

'వాడితల్లి గుళ్ళోకెళ్ళింది'

'అంతా యేమయ్యారు?'

'పుత్తరతీర్థాని కెళ్ళారు'

'ఎప్పటి కొస్తారో?'

'దీపాలు ఆరేవేళకి'

'సరే, వచ్చిందేమో యిచ్చిరా'

ఆమె తిరిగి వెళుతుంది.

*   *   *

'ఇంతసేపు ఏమిచేస్తుందో?' అనుకుంటూ అటూ యిటూ తిరిగాడు-ఆనందం.

తొమ్మిదికొట్టింది- గడియారం

*   *   *

ప్రొద్దెక్కినా లేవకపోతే,—

తట్టుతూ, లేపింది మధురం- ఆనందాన్ని !—

ఎఱుపెక్కిన కళ్ళతో,-

బరువెక్కిన హృదయంతో...

విసుక్కుంటూ లేచాడు- ఆనందం.

'ఇంత ఆలస్యంగా లేచారు ఈ వేళ ఆఫీసులో సెలవు పెట్టారేం?'

'హృదయంలో, పూఁరితిత్తులు బరువెక్కినై'

'కమలాకరాన్ని కబురుచేస్తే? —'

'కోమలహృదయం కందుతుందేమో?'

'మీయిష్టం...'

... ...

'వాళ్ళబ్బాయీ, ...'

'తీసుకురా,— పాపం'

....

* * *

'మధురం! మనకు సంతు లేదుకదా?' అని అనుమానంగా ప్రశ్నించాడు— సాసర్లో 'ఓల్టీన్' పోసుకుంటూ!

'కళ్ళనీళ్లు తుడిచేందుకు..'

'అబ్బాయిని యిచ్చి...'

'వెళ్ళిరా పాపం'

* * *

'వెళ్ళి గంట అయిందే? యింతవరకూ ఏంచేస్తుందో?—ఓహో!...'

* * *

మందహాసంతో మధురం వచ్చింది-

'నన్ను మరపించేవాళ్ళెవరూ? అన్నాడు ఆనందం.

'అబ్బాయే' అని ముద్దులాడింది.

'ఎవరబ్బాయి?' ఓవిధమైన ప్రశ్న-

ఆమె లేతగుండె కరడుకట్టింది. లేని సంతాపం లేచివచ్చింది. అసలు విషయం అనబోయింది. కంఠంలో కఫం అడ్డుపడి చంకలోని చంటివాడు చతికిలపడ్డాడు.

* * *

'ఏం? మాట్లాడవేం? ఏరంకు మొ...'

'లేదు అపోహపడకండి'

'నాయింటిలోంచి వెళ్ళిపో, —లంజా?—'

'నన్ను అలా అనకండి. నా అనే వాళ్లు లేరు.'

'ఏమీ లేని యిస్తరి ఎగిరిపడ్డం ఎందుకు?'

'నోరులేని పిల్లాడిని...'

'వీల్లేదు లేచి వెళ్ళిపో, చండివాడితో,'

* * *

ఆమె అసలుభర్త త్రాగుబోతు. కళ్లు తెలియక ఒళ్లుచితుక కొట్టేవాడు.

* * *

కూటికి లేక కూలికి వెళ్ళేది

* * *

నిండుగర్భిణితో వుంటే, వెళ్లగొట్టాడు—పాపం!

* * *

పదిరోజులు పస్తుండి ప్రసవించింది

* * *

ఆరో నెలలో ఆనందం చేరదీశాడు.

కొడుకుసంగతి కప్పిపుచ్చింది—

అవు ననుకొని ఆదరించాడు-ఆనందం.

పొరుగింటిలో వుంచి పాపని పొట్ట నింపుతూంది!—

పరమరహస్యంగా పసివాన్ని—

మాతృ ప్రేమ!

* * *

మధురానికి 'మళ్ళీ పెళ్ళి' ఆనందంతో!

కొడుకుసంగతి కొనకపోయాడు—

రంకుతనమని అపోహపడ్డాడు.

ఆఖరుకి యింటిలోంచి పొమ్మన్నాడు—పాపం!

సమాధాన మేమీ చెప్పలేకపోయింది- ఆమె

కండ్లెర్రజేసి గర్జించాడు- అతను.

ఆమె పిల్లాడిని ఎత్తుకుంది.

* * *

మెడపట్టి బైటికి గెంటాడు.

* * *

హోరున వీస్తూంది-గాలి.

భోరున కురుస్తూంది-వాన.

ఫడ ఫడ పడ్ పడ్ మని - పడింది పిడుగు.

కన్ను పొడుచుకున్నా—కనుపించని కటికి చీకటి!

నల్లనికురులు మెల్లగవీడి—

ముఖంనిండా క్రమ్మయి!

పాడలిపోతున్న హృదయంతో—

తడబడుతున్న కాళ్ళతో!

వణకిపోతున్న కంఠంతో!—

అంధకారబంధురమైన ప్రకృతిలో

ఐక్యమయింది - మధురం.

నాల్గశ్రుబిందువులు

[పాయమందని పసికన్నె. అభము శుభమెఱుగని వయసునందే పసుపు కుంకుమ మాసినది. జీవిత మొక మెఱుపు వంటిది. క్షణికము. ఉన్న రెండు క్షణములలో కళ్ళను మిఱుమిట్లు గొల్పుతుంది. మరుక్షణం అంధకారంలో అణగిపోయి నిరాశ కల్పిస్తుంది. చిన్ని నాథుని, విధినోటబెట్టుకొన్న దెఱుగని కన్నె సోయగముపైనా, అమాయకతపైనా జాలికల్గి రాలిన బిందువు లివి!]

ప్రొద్దుప్రొద్దునె
పొన్నపూలను
అద్దమందున
దిద్దుకొందువు!

ఎవరికోసర మింత?
ఎందుకోసర మింక?

చిన్ని నాథుని
చిత్రపటమును
పొన్నపూలతో
పూజసేతువు! ఎవరి॥

చెలులగూడుక
చెలువుమీఱగ
చిట్టిబొట్టును
పట్టుచుందువు ఎవరి॥

ఆటలందున
అలరుబోడులు
నాథునడుగగ
నవ్వుకొందువు ఎవరి॥

—పిల్లలమఱ్ఱి వెంకటహనుమంతరావు.

చిత్రానికి హత్య

[చిన్న కథ]

చిత్రకారుడు సేట్‌జీ రెండో భార్య చంపను హరించాడు. సేట్‌జీ సామాన్యుడా! ఆశ్రయమిస్తూనే సేట్‌జీ చతురతగా చిత్రకారుడిమీద కసితీర్చుకున్నాడు. చిత్రకారుడి చిత్రాలన్నీ సేట్‌జీ ఇంట్లో మగ్గిపోయాయి. ఒక ఉత్తమ చిత్రానికి చిత్రకారుని కళ్ళ ఎదుటే హత్య. ఆ హత్యతో అతని మరణం పూర్తి అయింది.

రచయిత :

గుంటూరు సత్యనారాయణ, ఎం. ఏ.

౧

ఆ చిన్న నుదురూ, పొదలవంటి కనుబొమలూ, వంకరతిరిగిన ముక్కూ, అడ్డదిడ్డంగా ఉన్న పలువరసా, చూసినవాళ్ళెవరూ సేటుజీని కళాపిపాసగలవాడను కోరు. అమితమైన ధనసంపత్తీ, నలభయ్యోపడిదాటినా మొక్కపోని శరీరం, చక్కటి రెండోపెళ్ళిపెళ్ళాం— ఏవీకూడా కళాపిపాసను సూచించవు. కాని, సేట్‌జీ మేడలో ఎక్కడచూచినా చిత్రాలే. అందులో ఒక చిత్రం కూడా ఐదువందల తక్కువఖరీదు లేదు; ఆగదుల్లోకి వెళ్ళిన చిత్రకారుడికి వేరే సిఫారసు అక్కరలేదు. ప్రతి చిత్రకారుడూ మొదట సేట్‌జీని, తరువాత ప్రపంచాన్ని మెప్పించడానికి యత్నించేవాడు. చిత్రకళాకౌశల్యం గుర్తించడంలో సేట్‌జీది అందెవేసినచేయి.

కాని ముఖాముఖిగా అతణ్ణిచూసినవాళ్లు చాలతక్కువ. అందువల్లాన్ని అతణ్ణిగురించి ఎన్నో కట్టుకథలు గిరాకిగా ఉండేవి. సాధారణంగా అంత క్రూరుడు ఉండడని ప్రతీతి. ఈ అపవాదుమీద, అతడి కళాపిపాస చక్కగా ప్రకాశించింది.

ఆదినం ప్రతి పత్రికలోనూ, నాటి చిత్రరచనాప్రదర్శనంలోని "నటరాజ తాండవం" చిత్రంగురించి అంతులేని ప్రశంసలు ప్రచురింపబడ్డవి. ప్రతివారూ అదేమాట. క్రమంగా సేట్‌జీ చెవుల్లో పడ్డది. ఆమరునాడు అతడు ప్రదర్శనశాలకు వెళ్లేడు...

ఎన్నడూ రాని సేట్‌జీ వచ్చేడంటే, ఆ 'నటరాజు'ని చిత్రించిన కళాకారుడిదే అదృష్టం అనుకున్నారంతా. జనులు తండోపతండంగా వచ్చేరు— సేట్‌జీ ఆ బొమ్మను ఎంతకు కొంటాడో చూడ్డానికి. సేట్‌జీ లోనికివెళ్ళగానే ఆచిత్రం ఆహ్వానించింది. ఒకసారి చూచేడు. అంతే...మరి ఆచిత్రందృష్టే లేదు. జనం విస్తుబోయింది. ఒకమూలను గోడకువేలాడుతున్న, చిన్న చిత్రందగ్గరకు తిన్నగా వెళ్ళి అతడు ఆగిపోయేడు. 'సముద్రుడు' ఆచిత్రంపేరు. దిగువ చిన్నచీటీపై 'అమ్మబడదు' అని చదివేడు. చిత్రకారుడిపేరు చూచేడు— రామం... మాటాడకుండా తిరిగివచ్చేడు.

మరునాడు పత్రికలన్నీ ఆ చిన్న చిత్రాన్ని అమితోత్సాహంతో ప్రశంసించేయి. రామానికి చిత్రరచనలో ఉన్నతస్థానం ఏర్పడింది ... తరువాత పత్రికలు చెప్పేయి, ఆచిత్రానికి సేటుజీ రెండు వేలిచ్చేడని...

ఆవేళ రామం, శుభ్రమైన బట్టలు వేసుకు సేట్‌జీ ఇంటికి విందుకు బయలుదేరేడు. సేట్‌జీ గుమ్మంవద్ద స్వాగతం ఇచ్చి లోనికి తీసుకెళ్ళేడు. విందుదగ్గర రామానికి తనభార్యను పరిచయం చేశాడు : చంప పందొమ్మిదేళ్ళపిల్ల ; చాలా అందమైనది; సేట్‌జీ డబ్బుకు బలియైనది. రామాన్ని చూడగనే ఆమెకు నూతన వికాసం కలిగింది ..

రామం చిత్రాలు రాస్తున్నాడు; సేట్‌జీ తప్పకుండా వాటిని కొంటున్నాడు. నిత్యం రామం సేట్‌జీ ఇంటికి వెళుతూండేవాడు. క్రమంగా చంపకూ, రామానికీ సంబంధమేర్పడ్డది. చడీ చప్పుడూ లేకుండా ఒకనాడు ఇద్దరూ లేచిపోయేరు ..

సేట్‌జీ చలించలేదు. అతడి మౌనం ప్రపంచాన్ని విస్తుపరిచింది. ఆమె సంగతే ఎత్తేవాడుకాడు; పైగా ఎవరైనా ఆప్రసెత్తితే, నవ్వుతూ 'వాళ్ళప్రేమ నేనెందుకు కాదనాలి?' అనేవాడు.

ఇప్పటికీ సేటుజీ రామం చిత్రం వస్తే, మునుపటికన్న ఎక్కువధనం యిచ్చి కొనేవాడు. ఎవరన్నా ఆసంగతి తెస్తే, నిట్టూర్చి: 'ఆచిత్రకారుడి దా ప్రతిభ. నేనేం చెయ్యగలను?' అనేవాడు!

౨

కొన్ని నెలల తరువాత, రామంఎక్కడున్నదీ బహిరంగమైంది. సేట్‌జీ వెంటనే, వారిద్దరినీ క్షమించి, తనవద్దనే ఉండమని జాబువ్రాసేడు; తనకేమీ అసూయలేదనీ, రామంచిత్రాలంటే తనకభిమానం రోజురోజుకూ ఎక్కువై పోతున్నదనీ, తనవద్దనే ఉండి చిత్రాలువ్రాయవలసిందనీ, రాసేడు. రామం చాలా పశ్చాత్తాపపడి, తిరిగివచ్చేడు.

సేట్‌జీ నవ్వుతూ 'అబ్బాయ్! మిమ్మల్ని చూస్తే నాకు నవ్వువస్తోంది. మీ ఇద్దరిమధ్యా అనురాగం ఉంటే నేను కాదంటానా? వింతగా ఉందా? నీకు బోధపడదు. నీచిత్రాలన్నీ కొనెయ్యాలని నా ఆశయం. నీపేరుతో నాపేరుకూడా శాశ్వతంగా ఉండిపోవాలి. డబ్బుతో అమరత్వం కొనుక్కుంటున్నాను!'

ఈభరోసాతో రామానికి పూర్తిగా ధైర్యంవచ్చింది. సేట్‌దగ్గరే బసచేశాడు. అహోరాత్రాలు విసుగూ విరామం లేకుండా చిత్రాలురాసి ఇస్తున్నాడు సేట్‌జీకి. పైప్రపంచానికిదో తమాషాగా ఉంది...రామం కీర్తి ఖండాంతరాలు వ్యాపించింది. కాని, ఒక్కరూ అతడి చిత్రాలు ఇతరుచోట్ల చూడలేదు. అన్నీ సేట్ భవనాన్ని అలంకరిస్తున్నాయి. కాని సేటుజీ ప్రాపే అతడి కీర్తికి కారణం అయింది...

విశ్రాంతిలేకుండా పనిచెయ్యడంతో రామానికి జబ్బుచేసి, చాలాకాలం మంచం పట్టేడు...

౩

ఆవేళ సేటుజీభవనం నిశ్శబ్దంగా, కళావిహీనంగా ఉంది. సాయంత్రం ఆరుగంటలవేళ. ఆపెద్దగదిలో గోడలనిండా రామం చిత్రాలు వ్రేలాడుతున్నాయి. గదిమధ్య, పట్టుపరుపుల్లో శల్యమై, రామం బాధపడుతున్నాడు. కిటికీలన్నీ మూసిఉన్నాయి. ఇక నిమిషాలమీదవుంది అతడిజీవితం. సేటుజీ మంచందగ్గర నుంచుని, రోగి కళ్ళలోకి చూస్తున్నాడు తీక్షణంగా. సేటుజీ కళ్ళలో, ఇదివరకెన్నడూ తనుచూడని, మెరుగు కనుపించింది రామానికి; భయంతో ఒణికి కళ్లుమూసుకున్నాడు...కొంతసేపయాక, సేటుజీ:

'రామం!'

రామం కళ్లువిప్పేడు.

'అబ్బాయ్! ఇక కొన్ని నిముషాల్లో నీకీ లోకంతో ఋణం తీరిపోతుంది. నువ్వు నాకు తీరని అపకారంచేశేవు. నేను చంపను ఎంత ప్రేమిస్తున్నానో నీకు తెలీదు. నువ్వువచ్చి మమ్మల్ని వేరుచేశేవు. పొందిన అపకారం మరచిపోడం నాజాతకంలో లేదు. ఇన్నాళ్లు నేను చిత్రాలన్నీ ఎందుకు కొన్నానో తెలుసుకున్నావా? నీ చిత్రం ఒక్కటీ పైకి పోకుండా కొన్నాను. ఇక పైకిపోవు. నాలో హరించిపోతాయి. నీకు అమరత్వంలేదు. నీతో నీకీర్తి హరించిపోతుంది. ఇందులో ఒక్కచిత్రంకూడా వెలుతురు చూడదు!'

రామానికి క్రమంగా బోధపడింది సేటుజీ ఎంత చతురంగా, ఎంతఘోరంగా కసితీర్చుకొంటున్నాడో. మాటాడలేకపోయాడు. నీరసమైన కళ్ళతో ఆ 'సముద్రుడు' చిత్రాన్ని చూస్తున్నాడు. గుండెలలో బాధ ఎక్కువైంది. క్రమంగా చీకటి ఎక్కువైంది. గదిలో వస్తువులు లీలగా కనుపిస్తున్నాయి...

సేటుజీలీల క్రమంగా మంచందగ్గర నుంచి కదిలింది; చేతిలో కత్తి విప్పింది; క్రమంగా, చట్రంలో అమర్చిన 'సముద్రుడు' చిత్రంవైపు సాగింది... చెయ్యి పైకిలేచింది...

రామం, అంత్య ప్రయత్నంతో 'సేటుజీ'అన్నాడు వినుపించని స్వరంతో...

'కసక్'...

చిత్రం 'ఛర్రు'మన్నది...

రామంశరీరం వెనక్కుపడ్డది...

"ఆంధ్రభూమి" పుస్తకపీఠము

ఛాందోగ్యోపనిషత్తు.

సుప్రసిద్ధాలయిన దశోపనిషత్తులలో ఛాందోగ్యం తొమ్మిదోది. తొలుతటి ఎనిమిది ఉపనిషత్తులకంటె ఛాందోగ్యం మిక్కిలి విపులమైన గ్రంథం.

అనువాదకకళాశ్రేష్ఠులైన శ్రీ బచ్చు పాపయ్యశ్రేష్ఠిగారు దశోపనిషత్తులను ఆంధ్రానువాదసహితంగా ప్రచురింప దొరకొని అందు మొదటి ఐదింటిని ఒక సంపుటముగాను, తరువాతి మూడింటిని ఒక సంపుటముగాను ప్రచురించి వున్నారు. ఛాందోగ్యం ప్రత్యేకం ఒక సంపుటంగా ఇపుడు వెలయించారు.

ఉపనిషత్ప్రతిపాద్యాలైన ముప్ఫయిరెండు బ్రహ్మవిద్యల్లో పదమూడు ఛాందోగ్యమందే వున్నాయి. అట్టి ఉపనిషత్తును తెనుగులోకి సులభసుందరశైలిని అనువదించడం సిద్ధహస్తులైన పండితులకేకాని సామాన్యులకు సాధ్యంకాదు. శ్రీ శ్రేష్ఠిగారు అట్టి అసామాన్యకార్యాన్ని ప్రశంసనీయంగా నిర్వహించి ఆంధ్రులకు మేలుచేశారు.

మూలశ్లోకము, ప్రతిపదార్థము ఒకసైడున—అనువాదకపద్యము రెండోసైడున ముద్రింపబడి పుస్తకం ముచ్చటగా ఉన్నది. అనువాదకపద్యాలు గీతపద్యాలై సులభార్థబోధకాలై వున్నాయి.

పదో ఉపనిషత్తు ఐన బృహదారణ్యకాన్నికూడా ఈరీతిని వెలయించగలిగితే శ్రీశ్రేష్ఠిగారు ఆంధ్రసారస్వతానికి మంచిసేవ చేసినవారౌతారు.

ఛాందోగ్యం క్రౌనుసైజున సుమారు 700 పేజీల గ్రంథం. చక్కని కాలికో బైండు. వెల రు 2-4-0.

దొరుకుచోటు : ద్వారకనాథ్ అండు కంపెని, 55 ప్రాటన్ ముత్యాలమొదలివీధి, జార్జిటవున్, మదరాసు.

అమ్మా!

దివంగతఐన తల్లిని స్మరిస్తూ శ్రీకుమారి జలగం ధనలక్ష్మి రచించిన చిన్న వచనకావ్యం. తల్లి శ్రేష్ఠత్వం నిరూపింపబడింది. కొన్ని పేరాలు బాగా కరుణామయంగా వున్నాయి. ఈవిదుషిరచనం ప్రోత్సహించదగినదిగా వుంది.

చిరునామా : ధనలక్ష్మి భవనము; 23, రామకృష్ణవీధి, మదరాసు.

రామాయణసారము.

సుప్రసిద్ధాంధ్రరచయితలైన శ్రీ గొబ్బూరి వెంకటానంద రాఘవరావుగారు వ్రాసింది. ఇందు రామాయణ ప్రాశస్త్యం నిరూపింపబడింది. గ్రంథం చిన్నదైనా విజ్ఞానదాయకంగావుంది. దీనివెల 0-2-0. కావలసినవారు సెక్రటరీ, ఆంధ్రావలి, తెనుగుగుడి, ఎలమంచిలి అని వ్రాసేది.

బాలరోగములు : చికిత్స

ఈపుస్తకంలో హోమియో విధానం క్రింద బాలరోగాల చికిత్సలు వివరింపబడ్డాయి.

తాడేపల్లిగూడెం తాలూకా హోమోపతి సంఘకార్యదర్శులైన డాక్టరు తల్లాప్రగడ కామేశ్వరరావుగారు రచించింది.

హోమోపతి ఔషధాలు ముఖ్యంగా పిల్లలకు చాలా మంచివని ఆశాస్త్రవేత్తల అభిప్రాయం. ఇవి నిరపాయకరాలని చెప్పవచ్చు.

యీగ్రంథరచనం మంచి పద్ధతిమీద నడిచింది. దీనిని చదివితే హోమియోపతి విధానంక్రింద ప్రతివారున్నూ పిల్లలకు వైద్యం చేయవచ్చు. పిల్లలుగల ప్రతియింటా యీగ్రంథం ఒకటి వుండడం మంచిది.

500 పుటలు. గ్లేజుకాగితాలు. వెల 1-12-0 లు. పుస్తకాలకు పశ్చిమగోదావరిజిల్లా ఉంగుటూరు నివాసులైన గ్రంథకర్తకు వ్రాసేది.

ఆంధ్రవీరకుమారశతకము

కందపద్యశతకము. కృతికర్త మాజీ పార్లమెంటరీ కార్యదర్శి ఐన శ్రీ. బి. ఎస్. మూర్తి.

యీశతకం ఆంధ్రభూమి పాఠకులకు పరిచయమైందే. ఇందలి కొన్ని పద్యాలు యీవరకు యీపత్రికలో ప్రచురితాలు ఐనాయి.

యీశతకంలోని పద్యాల్లో ఆంధ్రోత్సాహం వెల్లువలై ప్రవహిస్తూవుంది.

శ్రీ బెజవాడ గోపాలరెడ్డి యీశతకానికి చక్కని పీఠిక వ్రాసివున్నారు.

యీశతక పఠనం ఆంధ్రులకు చాలా ఉద్దీపనకారిగా వుండగలదని చెప్పడంవల్ల గ్రంధప్రాశస్త్యం నూత్న్యంగా తేలుతుంది.

వెల నాలుగు అణాలు. చిరునామా: నవజీవన ఆఫీసు - 68, మేడాక్సు వీధి, వేపేరి, మదరాసు.

తిమ్మరుసు.

బుద్ధిమంతులైన నేటి ఆంధ్రయువకులలో ఒకరైన శ్రీ గుంటూరు సత్యనారాయణ ఎం.ఏ. గారు రచియించిన నాటకము.

విజయనగర సామ్రాజ్య చరిత్రలో తిమ్మరుసు పాత్ర ప్రత్యేకవిశిష్టత కలది. ఆపాత్రను ఆధారంగా తీసుకుని వ్రాయబడ్డది యీనాటకం. ఇందులో తిమ్మరుసు, రాయలు, గజపతి ముఖ్య పాత్రలు.

యీనాటకంలో అనేకమైన కొత్త పోకడలు వున్నాయి. అయితే అవి పరిపక్వమైన దశను ప్రదర్శించడంలేదు. ఇది తొలిరచనం కావడమే దీనికి కారణం కావచ్చు.

క్రౌనుసైజున 74 పుటలు. వెల 0-8-0 వలసినవారు గ్రంథకర్త పేర ఎలమంచిలి వ్రాసేది.

ఉద్యానం.

మాంగల్యం - యీరయ్య ప్రేమ - కిసమస్ సెలవుల్లో - నేనూ వస్తున్నా - ఫోటో - అనే ఐదు చిన్నకథల సంపుటి యీఉద్యానం. యీ చిన్నకథలు రచియించింది శ్రీ పురాణం కుమారరాఘవశాస్త్రి గారు బి. ఏ.

శ్రీవారు ఆంధ్రభూమి పాఠకులకు చిరపరిచితులు. కథారచనలో వారి చేయి బాగా తిరిగింది. యీఐదు చిన్నకథలలో ఏదో ఒక మహత్తరమైన నీతి గర్భితమైవుంది. ముఖ్యంగా మాంగల్యం కథ ఉదంచితమైవుంది. అందుచేతనే గ్రంధకర్త యీగ్రంథానికి ఆకథను ముఖమండనంగా వుంచారనుకుంటాము.

యీ కథలలో అసభ్యత ఎక్కడా లేదు. స్త్రీలు చదవరాని, వినరాని వాక్యం ఒక్కటికూడా లేదు.

శుచిప్రాపకాలైన ఇట్టి కథలతో మన సంఘజీవనాన్ని ఉత్కృష్టానికి కొనిపోవచ్చును. శ్రీశాస్త్రిగారు కథారచనంలో ఇట్టి ఉత్తమమైన ఆదర్శాన్నే కలిగివున్నారని వారు లోగడ ప్రచురించిన 'గళ్ళచీర', ఇప్పుడు ప్రచురించిన యీ 'ఉద్యానం' వెల్లడిచేస్తూ వున్నాయి.

ఐదు చిన్నకథల యీ సంపుటి వెల ఐదు అణాలు. గ్రంథమూల్యం ఐదు అణాలున్నూ, పోస్టేజి ఒక అణాయున్నూ మొత్తం ఆరుఅణాల పోస్టుబిళ్ళలు పంపితే యీగ్రంథాన్ని బడయవచ్చును.

చిరునామా: పురాణం కుమారరాఘవశాస్త్రి, వాడపల్లి హౌస్, బెజవాడ.

వృష పంచాంగము

శాస్త్రీయమైన ఆయుర్వేదౌషధముల తయారీకి పేరుమోసిన బెజవాడలోని శ్రీ మృత్యుంజయఫార్మసీవారు ప్రచురించిన వృషపంచాంగమును ఆనందంతో అందుకుంటున్నాము. యీపంచాంగము బ్రహ్మశ్రీ గొట్టిముక్కల సుందరరామశాస్త్రి సిద్ధాంతిగారిచే గుణింపబడినది. ఇదని గణనం గడియలలోగాక గంటలలో సాగి బహుజనోపయోగంగా వుంది. సాయనపద్ధతిని వ్రాయబడిన ఇందలి వృషసంవత్సర ప్రపంచ ఫలితాలు చదువతగివున్నాయి. భారతదేశ ఫలితాలు విపులంగా గలవు.

Printed at the Andhrabhumi Printing Works, 36 Mukatal Street. Vepery P.O, Madras.
Editor & Publisher · Andra Seshagiri Rao. B A.